

కష్టాలు తీరేదెన్నడో..?

- ఆ ఇళ్లలో కాపురాలు చేసేదెప్పుడో...
- టిడ్కో గృహ లబ్ధిదారుల ఆవేదన
- పేదల సొంతింటి కల సాకారమయ్యేనా !?
- పొంగూరు, వేములపాటి చొరవ చూపాలి మరి..!!

నెల్లూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు.. పదేళ్ల నిరీక్షణ..! అయినా, జిల్లాలోని వేలాదిమంది పేద, మధ్య తరగతి ప్రజల సొంతింట కల సాకారం కానేలేదు. పట్టణ ప్రాంత పేదలకు గేటెడ్ కమ్యూనిటీ తరహాలో బహుళ అంతస్థుల భవన సముదాయాలు కట్టివ్వాలని టీడీపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నం 2019 ఎన్నికల ఫలితాల క్రమంలో అర్ధంతరంగా ఆగిపోయింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తాళాలు అప్పగిస్తుందని పేదలు ఆశిస్తే.. రాజకీయ ద్వేషంతో ఆ గృహాలు పాడుపడేలా చేసింది. ఐదేళ్ల పాటు లబ్ధిదారులు తాళాలు తీసే అవకాశం ఇవ్వకుండా చేసింది. 2024 ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టిన ప్రజలు మళ్లీ టిడ్కో ఇళ్లపై ఆశలు పెట్టుకున్నారు. అప్పట్లో పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా టిడ్కో గృహాలకు రూపకల్పన చేసిన పొంగూరు నారాయణ.. మళ్లీ అదేశాఖకు మంత్రి కావడం.. జిల్లాకు చెందిన వ్యక్తి, జనసేన నాయకుడు వేముల పాటి అజయ్‌బాబు ఏపీ టిడ్కో ఛైర్మన్ కావడంతో ఇళ్లకోసం ఎదురు చూస్తున్నవారి ఆశలు రెట్టింప య్యాయి. ఇప్పుడు వాటిని బాగు చేయడంతో పాటు మౌలిక వసతు లన్నీ కల్పించడం ద్వారా లబ్ధిదారు లను ఆకర్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



అసంపూర్తిగా ఉన్న అక్కచెరువుపాడులోని టిడ్కో గృహాలు

పరిస్థితి ఇదీ..

- నెల్లూరు నగర పరిధిలో మొత్తం ఆరుచోట్ల 20వేలకు పైగా టిడ్కో గృహాలు నిర్మించారు. అయితే గత పాలకుల పుణ్యమా అని.. అవేవీ నివాసానికి అనుకూలంగా లేవు. వెంకటేశ్వరపురం ఫేజ్1లో నిర్మించిన గృహాల్లో మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. వీధి దీపాలు వెలగడం లేదు. చీకటి రాజ్యమేలడంతో అక్కడ అసాంఘిక శక్తుల కదలికలు ఎక్కు వయ్యాయి. పోలీసు నిఘా లేదు. దీంతో అక్కడ కాపురాలు ఉండాలంటేనే జనం హడలిపోతున్నారు. అల్లీపురం గృహసముదాయంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. చాలా ఇళ్లకు కరెంటు సరఫరా లేదు. డ్రైనేజీ కనెక్టి విటీ లేదు. రోడ్లు లేవు, ముళ్లపొదలు భయం గొలుపుతున్నాయి. అక్క చెరువుపాడు వద్ద భవన నిర్మాణాలు పూర్తి అయినా తాగునీరు, కరెంటు లేదు. కల్లూరుపల్లిలోనూ ఇదే పరిస్థితి. వీటిల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తే తప్ప ప్రజలు ఆ ఇళ్లలో చేరే పరిస్థితి లేదు.
- ఆత్మకూరులో 1408 ఇళ్లు నిర్మించారు. వీటిలో 1096ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు కేటాయించారు. మిగిలినవి ఇంకా కేటాయిచలేదు. కేటాయించిన ఇళ్లలో 700 మంది మాత్రమే కాపురం ఉంటున్నారు. ఇక్కడ కూడా మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గృహ సముదాయానికి ప్రహరీ గోడ లేదు. తాగునీటి సమస్య వెంటాడుతోంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది.

ఇళ్ల మధ్య మురుగు తాండవిస్తోంది. గృహసముదాయం చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు బలిసిపోయాయి. వీటివల్ల విషకీటకాలు ఇళ్లలోకి చొరపడుతున్నాయి. వెంటనే ఇక్కడ మౌలిక వసతులు కల్పించని పక్షంలో ఉన్న కాపురాలు కూడా ఖాళీ చేసుకొని వెళ్లిపోయే ప్రమాదం ఉంది.

- కందుకూరులో 1408 గృహాలు నిర్మించారు. వీటిలో 90 శాతం లబ్ధిదారులకు కేటాయించారు. కానీ ప్రస్తుతం ఇక్కడ 400 కుటుంబాలు మాత్రమే కాపురం ఉంటున్నాయి. ఇక్కడ కూడా నీటి వసతి లేదు. అంతర్గత సిమెంటు రోడ్ల నిర్మాణం జరగలేదు. పార్కు, మినీ ఫంక్షన్ హాలు పనులు అర్ధంతరంగా వదిలేశారు.
- కావలిలో 2112 గృహాలు నిర్మించారు. వీటిలో 700 మంది మాత్రమే కాపురం ఉన్నారు. వర్షం కురిస్తే ఈ గృహసము దాయంలోకి వరద నీరు ప్రవేశిస్తాయి. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ప్రహరీ గోడ లేదు.



ఆత్మకూరులోని టిడ్కో ఇళ్ల సముదాయం మధ్య పిచ్చిమొక్కలతో పార్కు స్థలం

ఇలా వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన టిడ్కో ఇళ్లు దాదాపుగా నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వంలోనైనా ఇవి బాగుపడుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌బాబు... ఇద్దరూ జిల్లాకు చెందిన వారు కావడంతో పక్కా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలు ఆశలు పెంచుకున్నారు. టిడ్కో గృహసముదాయాలు మౌలిక వసతులతో అందంగా తయారు కావాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఆ దిశగా వారిద్దరూ అడుగులు వేయాలని ప్రజలు ఆశిస్తున్నారు.



జికా వైరస్ బాధితుల కోసం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన పడకలు

లేదు..లేదంటూనే ఇదేంటి?

- జికా వైరస్ రోగుల కోసం జీజీహెచ్‌లో ఐదు పడకలు
- ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏర్పాటు
- మందులు కూడా సిద్ధం

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జికా వైరస్ లేదు... లేదం టూనే అధికారులు వైరస్ సోకిన వ్యాధిగ్రస్థుల కోసం ప్రత్యేక పడకలు ఏర్పాటు చేయడం పలు అనుమానా లను తావిస్తున్నది. జిల్లాలో జికా వైరస్ ఇంకా నిర్ధారణ కాకపోయినా ప్రభుత్వ ముందస్తు చర్యలు తీసుకుంటున్నది. ఇందు లో భాగంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐదు పడకలను ఏర్పాటు చేసింది. పల్మనాలజీ విభాగంలో జికా వైరస్ అనుమానితులకు, రోగులకు చికిత్సలు అందిం చేందుకు జనరల్ మెడిసిన్ విభాగం అన్నీ ఏర్పాట్లు చేసింది. అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచింది. జీజీహెచ్ అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు చేశారు.

జిల్లాలోని మర్రిపాడు మండలం వెంకటాపురంలో బద్దెల సుబ్బరాయుడు (5) అనుమానిత జికా వైరస్‌కు గురయ్యాడు. దీంతో తల్లితండ్రులు నాగరాజు, కళ్యాణిలు నారాయణ ఆసుపత్రికి తీసుకుపోగా, జికా వైరస్ అన్న అనుమానంతో చెన్నైలోని ఎగ్మూర్ ఆసుపత్రికి తరలించారు. తమిళనాడు ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుని పరీక్షలు నిర్వహించి, జికా వైరస్ లేదని నిర్ధారించింది. అయితే బాధితుడి తల్లిదండ్రులతోపాటు మరో 20 మంది రక్తనమూనాలను సేకరించి, పూణేలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. అయితే ఇంకా ఫలితాలు రాలేదు. అయినా వెంకటాపురం గ్రామాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం సందర్శించి, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టింది. దోమల నివారణకు మందులు పిచికారీ చేయించింది. వైద్య శిబిరం ఏర్పాటు చేయించింది. ఎవరైనా జ్వర పీడితులు ఉన్నారా... లేదా ? అన్న కోణంలోనూ పూర్తిస్థాయి సర్వే చేపట్టింది. ఈ క్రమలో జీజీహెచ్‌లో ప్రత్యేక పడకల ఏర్పాటు ముందు జాగ్రత్త చర్యనా.. లేక జిల్లాలో రోగులు ఎవరైనా ఉన్నారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

బాధితుల కోసం అన్నీ ఏర్పాట్లు



జికా వైరస్ బాధితుల కోసం ముందస్తుగా ఐదు పడకలు ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని ఏర్పాట్లు చేశాం. జికా వైరస్ బాధితులకు మెరుగైన వైద్య అందించేందుకు జీజీహెచ్‌లో వైద్యులు సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో జికా వైరస్ లేదని చెన్నైలోని ల్యాబ్ అధికారులు నిర్ధారించారు. పూణే వైరాలజీ ల్యాబ్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాం.

- డాక్టర్ కళారాణి, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్

కుడి కాలువకు పూర్తి సామర్థ్యంతో నీరు

- రేపటిలోగా అందించాలని కలెక్టర్ ఆదేశం
- తాత్కాలిక గేటు వద్దు : రైతులు
- మంత్రి జోక్యంతో కదలిన అధికార యంత్రాంగం



కుడి కాలువ గేటుకు మోటార్లను ఏర్పాటు చేస్తున్న క్రేన్

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుడి కాలువ స్టాప్‌లాక్ గేటు విరిగిపోయి ఆయకట్టుకు నీరందక రైతులు ఆందోళన చెందుతున్న క్రమం లో ఆదివారం రాళ్లపాడు రిజర్వాయ రును జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సంద ర్శించారు. కాలువ గేటు వద్ద మోటార్ల ద్వారా నీటిని అందించేందుకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. కాలువకు వెళుతున్న నీటి పరిమాణం వివరాలను అడిగి తెలుసుకున్నారు. 30 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్లను సోమవారం మధ్యాహ్నంలోగా ఏర్పాటు చేసి కాలువలో పూర్తి సామర్థ్యం నీరు వెళ్లేలా చూడటంతోపాటు దిగువ గ్రామాలకు సక్రమంగా నీరు అందేలా పర్యవేక్షించాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే రెవెన్యూ, పోలీసుశాఖల సహకారం తీసుకోవాలని సూచించారు.



మోటార్ల ఏర్పాటును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్, సబ్‌కలెక్టర్ శ్రీపూజ, ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్‌ఈ వరలక్ష్మి తదితరులు

గేటు లేపకుంటే కష్టమే...

తాత్కాలిక చర్యలు వద్దని, పడిపోయిన గేటు లేపేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను రైతులు కోరారు. మోటార్ల ద్వారా అందించే నీటితో నాట్లు వేసుకోలేమని, ఇప్పటికే దుక్కులు ఎండిపోతూ.. పోసిన నార్లు ముదిరి పోతున్నాయని, దీంతో నిద్రలేని రాత్రు లు గడుపుతున్నామని కలెక్టర్ వద్ద వారు వాపో యారు. ఇదేపద్ధతిలో నీరందిస్తే మరో 20రోజు లకు కూడా నాట్లు వేసుకోలేమని ఆవేదన వ్యక్తం చేశారు. తీరా నాట్లు వేశాక సక్రమంగా నీరందకపోతే ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామన్నారు. రామాయపట్నం పోర్టు, చీమకుర్తి గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద భారీ క్రేన్లు ఉన్నాయని, వాటిని తెప్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఇరిగేషన్ అధికారులు గేటు లేపాలని పట్టుదలతో పనులు చేయకుండా, పైఅధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి కాలం వెళ్లబుచ్చుతున్నారని పలువురు రైతులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నీటిమట్టం కొంతమేర తగ్గితే పడిపోయిన గేటు లేపడం సులువవుతుందని చెప్తున్నందున, మోటార్ల ద్వారా తాత్కాలికంగా నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, 15 రోజుల్లో సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాళ్లపాడు కుడి కాలువకు పూర్తి సామర్థ్యం నీరు ప్రవహించేంత వరకు దగ్గరుండి పర్యవేక్షించడంతో పాటు ఆయకట్టు చివరి భూము లకు కూడా సక్రమంగా నీరు అందేలా యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షించాలని కందు కూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజను కలెక్టరు ఆదేశించారు.

ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జోక్యంతో ఎట్టకేలకు అధికార యంత్రాంగం కదిలింది. కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, పలువురు ఆయకట్టు రైతులు గురువారం మంత్రి రామానాయుడిని కలిసి

మంత్రి జోక్యంతో కదిలిన యంత్రాంగం

రాళ్లపాడు రిజర్వాయర్ దుస్థితిని వివరించడంతోపాటు చిన్న సమస్యను 15 రోజులైనా పరిష్కరించలేక పోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడిన మంత్రి జిల్లా కలెక్టర్‌కు పరిస్థితిని వివరించాల్సిందిగా వారికి సూచించారు. శనివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే, రైతు ప్రతినిధులు నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌ని కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ ప్రాజెక్టు వద్దకు చేరుకొని జరుగుతున్న పనులను పర్యవేక్షించడంతోపాటు పురోగతిపై ప్రతిరోజు తనకు నివేదించాలని అధికారులను ఆదేశించారు.

షోకాజు నోటీసులు...

సస్పెన్షన్లు

- వణుకుతున్న నగర కార్పొరేషన్ ఉద్యోగులు
- కమిషనర్ కఠిన నిర్ణయాలతో బెంబేలు
- సిబ్బంది అవినీతి, నిర్లక్ష్యంపై కొరడా

నెల్లూరు(సిటీ),డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న అవినీతి, నిర్లక్ష్యంపై కమిషనర్ సూర్యతేజ కొరడా ఝుళిపిస్తున్నారు. దీంతో అధికారులు, ఉద్యో గులు, సిబ్బంది వణికిపోతున్నారు. అందుతున్న ఫిర్యాదులు, ఆకస్మిక తనిఖీలతో పలు విభాగాల పనితీరు పరిశీలిస్తున్న ఆయన ఎవరి ఊహకు అందని విధంగా ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. రెవెన్యూ విభాగంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఆర్ఐ, ఆర్వోలను సమూలంగా బదిలీ చేశారు. సిటీప్లానింగ్‌లో అవినీతి క్షేత్రస్థాయిలో జరుగుతుందని గ్రహించిన కమిషనర్ సచివాలయాల్లోని ప్లానింగ్ సెక్రటరీలందరినీ కూడా బదిలీ చేశారు. తాజాగా ఆ విభాగం ఉన్నతాధికారి కృష్ణకిషోర్ నిర క్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర డైరెక్టర్‌కు సరెండర్ చేశారు. మరో ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలను కూడా సస్పెండ్ చేశారు. దీంతో ఉద్యోగులంతా బెంబేలెత్తుతున్నారు.

హెచ్చరించినా బేఖాతర్



నెల్లూరు నగర పాలక సంస్థను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఉద్యోగులు, సిబ్బం దిలో నిర్లక్ష్యంతో పాటు జవాబు దారీతనం లేకుండా పోయింది. కూటమి ప్రభు త్వం కొలువుతీరాక ఎన్ఎంసీ కమిషనర్‌గా మల్లవరపు సూర్య తేజ వచ్చారు. ఇక్కడ నెల కొన్న అవినీతి, నిర్లక్ష్యపు చెదలును ఆయన క్షుణ్ణంగా పరిశీలిం చారు. తొలుత హెచ్చరించినా ఎవరూ పట్టించుకోకపోవడంతో సమూలంగా మార్పులు చేశారు. కొందరికి షోకాజు నోటీసులు ఇవ్వగా, మరికొందరిని సస్పెండ్ చేశారు. ఇక భవన నిర్మాణా లపై ఆకస్మిక తనిఖీలకు వెళ్లిన కమిషనర్ క్షేత్రస్థాయిలో అన్నీ గమనిస్తున్నారన్న సంకేతాలను పంపారు. రెండు సచివాల యాల్లో ప్లానింగ్ సెక్రటరీల అవినీతి, నిర్లక్ష్యంపై వేటు వేశారు. ఆపై అధికారులకు షోకాజు నోటీసులు కూడా జారీ చేశారు. వారిచ్చే సమాధానంతో తదుపరి నిర్ణయం ఉంటుందని పరోక్ష హెచ్చరిక పంపారు. పత్రికల్లో (ఆంధ్రజ్యోతి) వస్తున్న కథనాలను సుమోటోగా తీసుకుని చర్యలు చేపట్టాలని, తొలుతే కమిషనర్ ఆదేశించారు. ఆ పని చేయడం లేదన్న కారణంతో ఎస్ఈ రామ్మోహన్, ఉద్యాన అధికారి ప్రదీప్, ఈఈ శేషగిరిలకు ఇటీవలే షోకాజు నోటీసులిచ్చారు.

రాజకీయ జోక్యానికి చెక్

కార్పొరేషన్‌లో ఆఫీసు సబార్డినేట్ నుంచి విభాగాధిపతి వరకు మితిమీరిన రాజకీయ జోక్యంతో పని చేస్తున్నారన్నది అం దరికి తెలిసిన విషయమే. అయితే ఈ విధానానికి కళ్లెం వేస్తూ, రాజకీయ నాయకులతో సిఫార్సు చేయిస్తే వారి విజ్ఞప్తులను పట్టించుకోనంటూ ప్రత్యక్షంగానే హెచ్చరిస్తున్నా రు. ఇటీవల పలు విభాగాల్లోని ఉద్యోగులను కమిషనర్ బదిలీ చేశారు. వీరిలో అనేకమంది అధికార పార్టీ నేతలతో సిఫార్సులు చేయిం చారు. ఆగ్రహించిన కమిషనర్ వారి విజ్ఞప్తులను పట్టించు కోలేదు. ఈ నేపథ్యంలో విభాగాల వారీగా పట్టుపెంచుకుంటున్న కమిషనర్ ఏరోజు ఏ అధికారికి, ఏఉద్యోగికి షోకాజు నోటీసు ఇస్తారో.... ఎవరిపై సస్పెన్షన్ వేటు వేస్తారో.. అర్థం కాక వణిపో కిపోతున్నారు.



జలదంకి మండలం అన్నవరంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

పట్టణాలపైనే మోజు

- పల్లెలకు రాని ట్రాన్స్‌కో ఏఈలు
- ఉదయగిరి నియోజకవర్గమంటేనే ససేమిరా...
- 8 మండలాలకు వింజమూరులోనే నియామకం
- మిగిలినచోట్ల సబ్ ఇంజనీర్లే దిక్కు
- వ్యవసాయ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం
- సమస్యల పరిష్కారానికి రోజుల తరబడి నిరీక్షణ
- ఇబ్బందులు పడుతున్న రైతాంగం

జలదంకి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో 8 మండలాలు ఉంటే, ఒక్క వింజమూరు మండలానికే ట్రాన్స్‌కో ఏఈ నియామకం జరిగింది. మిగి లిన ఏడు మండలాలకు ఏఈల నియామకం జరగలేదు. ఈ మండలాల్లో సబ్‌ఇంజనీర్లుగా ఉన్న వారికే ఏఈ బాధ్యతలు అప్పగించారు. కొండాపురం మండలానికైతే సబ్‌ఇంజనీరు పోస్టు ఖాళీగా ఉండడంతో కలిగిరి సబ్‌ఇంజనీరును కొండాపురానికి ఇన్‌చార్జిగా నియమించారు. ఈ పరిస్థితి గత వైసీపీ పాలన నుంచి కొనసాగుతున్నది. కూటమి ప్రభుత్వంలోనైనా ఏఈలను నియమిస్తారని అనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. ఏఈలు లేక విద్యుత్ సమస్యలు ఏర్పడితే నెలలు తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పేరుకుపోతున్న సమస్యలు

ట్రాన్స్‌కో ఏఈలు లేక ఉదయగిరి నియోజకవర్గంలో రోజురోజుకు విద్యుత్ సమస్యలు పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా ఉదయగిరి ప్రాంతమంతా వ్యవసాయంపై ఆధారపడడమేకాక, వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగుచేస్తారు. ఇక్కడ బోరు బోవులు, మోటార్లు కూడా అధికంగానే ఉన్నాయి. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం కలుగుతుండడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఒక్క జలదంకి మండలం లోని కొంతభాగం సోమశిల ప్రాజెక్ట్ పరిధిలోని కావలి కాలువ ఆధారంగా వ్యవసాయం చేస్తారు. మిగతా ప్రాంతమంతా చెరువులు, వ్యవసాయ బోర్ల కింద వరి, పండ్లతోటలను సాగు చేస్తున్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో రైతులు నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల జలదంకి మండలంలోని పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వరినాట్లు వేయా లంటే మోటార్లకు విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి మండల టీడీపీ నాయకులు, రైతులు తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఈ సమస్యను విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. మంత్రి ఆదేశాలతో ట్రాన్స్‌కో ఎస్ఈ జలదంకి మండలంలో పర్యటించి, మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను బాగుచేయించడంతో రైతులు వరినాట్లు వేసుకున్నారు. చిన్నచిన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే, మంత్రి దాకా రైతులు వెళ్తేకానీ పరిష్కారం కావడం లేదు. దీన్నిబట్టి ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు ఏస్థాయిలో విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇంతటి ఇబ్బందులు ఎదుర్కోవడానికి ప్రధాన కారణం ఏఈల నియామకం లేకపోవడమే. అదే ఏఈలు ఉంటే కింది స్థాయి సిబ్బంది పనిలో వేగం ఉంటుంది. సబ్‌ఇంజనీరు చెబితే కింది స్థాయి సిబ్బంది సరిగా స్పందించడం లేదు. దీంతో విద్యుత్ సమస్యలు పేరుకుపోతున్నాయి.

పల్లెలంటేనే చిన్నచూపు

అదే కావలి నియోజకవర్గం విషయానికొస్తే కావలిపట్టణంలో ఇద్దరు ఏఈలతోపాటు అన్నీ మండలాలకు ఏఈలు ఉన్నారు. కావలి పట్టణ ప్రాంతం కావడంతోపాటుగా పట్టణానికి దగ్గరగా ఉన్న మండలాలు కావడంతో ఇక్కడ పనిచేసేందుకు ఏఈలు ఉత్సాహంగా ముందుకు వసున్నారు. పైరవీలు చేసుకుని మరీ పోస్టింగ్‌లు వేయించుకుంటున్నారు. ఇకపోతే ఆత్మకూరు, ఉదయగిరి పట్టణాల్లోనూ పనిచేసేందుకు పలువురు ఏఈలు ఉత్సాహం చూపుతున్నారు. పల్లెల్లో పోస్టింగ్ అంటే మాత్రం ఆసక్తి చూపడం లేదు.

పట్టణాల్లో ఆదాయం ఎక్కువే..

ఉదయగిరి నియోజకవర్గంలో పరిశ్రమలు, వ్యాపారసంస్థలు పెద్దగా లేవు. కేవలం గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులే ఉండడంతో ట్రాన్స్‌కో సిబ్బందికి ఆదాయమార్గాలు పెద్దగా ఉండవు. పరిశ్రమలు, రొయ్యల చెరువులు, వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు ఉన్న చోట్ల ఏఈలు పైరవీలు చేసుకుని పోస్టింగ్‌లు వేయించుకుంటే రెండు చేతులా సంపా దించుకోవచ్చు. అంతేకాక వారి కుటుంబాలు పట్టణాల్లో నివాసాలు ఉండడం, అక్కడి నుంచి ఉదయగిరి లాంటి సుదూరం ప్రాంతాలకు వెళ్లలేక పట్టణాల్లోనే పోస్టింగ్ వేయించుకుంటు న్నారు. పిల్లల విద్యాభ్యాసం కోసం కార్పొరేట్ పాఠశాలలు, కాలేజీలు లేకపోవడం కూడా ఉదయగిరి ప్రాంతంలో పోస్టింగ్‌కు ట్రాన్స్‌కో ఉద్యోగులు వెనుకాడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఉదయగిరి నియోజకవర్గంలో ఏఈలపై నియామకంపై శ్రద్ధ పెట్టాలని రైతాంగం కోరుతున్నది.





గూడు కూలింది..!?

వేగూరులో కూలిన ఇంటి శ్లాబు

శ్లాబు కూలడంతో మిగిలిన మొండి గోడలు

కోవూరు మండలంలోని వేగూరు గిరిజన కాలనీలో ఆదివారం ఓ ఇంటి శ్లాబు కూలింది. సుమారు 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహంలో ఈగ సుబ్బారావు కుటుంబం నివాసం ఉంటుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంటి గోడలు, శ్లాబు బాగా నానడంతో ఒక్కసారిగా శ్లాబు కూలింది. దీంతో ఇంట్లో వస్తువులన్నీ దెబ్బతిన్నాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ కుటుంబం గూడు లేక నిరాశ్రయులయ్యారు. కూలిన శ్లాబును పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను తహసీల్దారు నిర్మలానంద బాబాకు ఫోన్‌లో తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడి కుంటుంబం కోరుతుంది.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)

మట్టి దిబ్బను తొలగించరూ...!

కలువాయి ఎంపీడీవో, తహసీల్దారు, వెలుగు, గృహనిర్మాణ శాఖల కార్యాలయాల సముదాయంలోని ఆవరణలో రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వంలో వెఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం కోసం పెద్దగుంత తీశారు. వచ్చిన మట్టిని అక్కడే ఉన్న వెలుగు, గృహనిర్మాణ శాఖల కార్యాలయాల ముందు అడ్డంగా పెద్దదిబ్బలా పోశారు. ఆతరువాత నిర్మాణం నిలిచిపోగా మట్టిదిబ్బను అలాగే వదిలేశారు. కార్యాలయాల ముందు అడ్డంగా ఏళ్ల తరబడి మట్టి దిబ్బ ఉన్నా అధికారులు ఒక్కరు కూడా పట్టించుకోకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)



పోలీసుల ఆకస్మిక తనిఖీలు



నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న చిన్నబజారు పోలీసులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. లాడ్జీల్లో ప్రతీ గదిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో బస చేసిన వ్యక్తులను ప్రశ్నించారు. ఈ తనిఖీల వివరాలను ఆదివారం ఎస్పీ ఓ ప్రకటనలో వెల్లడించారు. శనివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో జిల్లా వ్యాప్తంగా ఓపెన్ డ్రింకింగ్ 80 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ 96 కేసులు, ఎంవీ యాక్ట్ 514 కేసులు నమోదు చేసి రూ.2,02,890 అపరాధ రుసుము విధించామని తెలిపారు. లాడ్జీల యాజమాన్యం అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, లాడ్జీ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

గాండ్ల, తెలికుల సంక్షేమానికి కృషి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు



గ్రోసు సుబ్బారావు,అనంతంలను సన్మానిస్తున్న నాయకులు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలోని గాండ్ల, తెలిక కులస్థుల సంక్షేమం, సమైక్యత కోసం కృషి చేస్తానని అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు చెప్పారు. ఆ సంఘం సర్వ ప్రతినిధి సమావేశం నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. సుబ్బారావు మాట్లాడుతూ గాండ్ల, తెలికుల కులస్థుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యాపరమైన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నరవ అనంతం మాట్లాడుతూ కులస్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, కోశాధికారి గార్లదిన్నె నాగరాజు, రాష్ట్రంలోని అన్నీ జిల్లా శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వరాల విజృంభణ

ఉదయగిరి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకింద గ్రామాలైన బిజ్జంపల్లి, కొత్తపల్లి, కృష్ణారెడ్డిపల్లి, లింగంనేనిపల్లి తదితర గ్రామాల్లో జ్వరాలు విజృంభించాయి. వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరం బారినపడి వారికి రోజుల తరబడి తగ్గకపోవడంతో అవస్థలు పడుతున్నారు. జ్వరపీడితుల్లో అధికంగా వృద్ధులు, చిన్నారులు ఉన్నారు. జ్వరం సోకిన వారు ఉదయగిరి, ఆత్మకూరు, వింజమూరు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్నారు. కొందరికి రక్త కణాలు తగ్గడంతో రోజుల తరబడి వైద్యశాలల్లో చికిత్స పొందాల్సి ఉండడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి జ్వరాలను అదుపులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హనుమకొండపాలెంలో ఎక్సైజ్ అధికారుల దాడులు

జలదంకి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండపాలెంలో ఆదివారం నెల్లూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది దాడులు చేపట్టారు. దాడుల్లో నాసిన లక్ష్మీప్రసన్న వద్ద ఉన్న 12 మద్యం బాటిళ్లతో పాటు మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వెంట కావలి ఎక్సైజ్ శాఖ ఎస్ఐ దేవిక, సిబ్బంది ఉన్నారు.



మద్యం సీసాలతో ఎక్సైజ్ ఎస్ఐ దేవిక, సిబ్బంది

బెల్టు దుకాణంపై దాడి

కొండాపురం, (ఆంధ్ర జ్యోతి): బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. కలిగిరి ఎక్సైజ్ సిబ్బంది మాల్యాద్రి, రాఘవులు ఆదివారం మర్రిగుంటలో దాడి చేశారు. దాడిలో బెల్టు దుకాణంలో మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తి వద్ద నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

వెంకటేశ్వరపురంలో దొంగ హల్‌చల్

● దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత



పట్టుబడ్డ ఒడిస్సాకి చెందిన వ్యక్తి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వర పురంలో గుర్తుతెలియని దొంగ ఆదివారం ఉదయం హల్‌చల్ చేశాడు. తెల్లవారు జామునుంచి పలు ప్రాంతాల్లో చక్కర్లు కొడుతూ అనుమానస్పదంగా కలియ తిరిగాడు. 11 గంటల సమయంలో విజయ డెయిరీ సమీ పంలోని పార్లర్ వద్ద శేఖర్ అనే వ్యక్తి పాలు కొనుగోలు చేసేందుకు బైక్ నిలిపి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ఒడిస్సాకి చెందిన ఆ దొంగ బైక్ తీసుకొని పరారయ్యాడు. గమనించిన స్థానికులు వెంటపడి అతన్ని పట్టుకొన్నారు. స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం నవాబుపేట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	186
స్కిన్‌లెస్	206
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7313
వెండి కిలో ధర	రూ. 89,700
వెండి ఒక గ్రాము	రూ.92.70

పత్తాలేని రైతుమిత్ర సంఘాలు

సాయం అందక అన్నదాతల అగచాట్లు
పునరుద్ధరిస్తే సత్ఫలితాలు

ఆత్మకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన రైతు మిత్ర సంఘాలు కనుమరుగయ్యాయి. దీంతో సాయం అందక అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం దిశగా ముందుకెళుతోంది. రైతుమిత్ర గ్రూపులను ఈ ప్రభుత్వం పునరుద్ధరిస్తే ఉపయుక్తంగా ఉంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

● **2003లో ఆవిర్భావం**

2003-04లో అప్పటి ప్రభుత్వం రైతుమిత్ర సంఘాలను ఏర్పాటు చేసింది. ఒక్కో సంఘంలో 15 మంది రైతులు సభ్యులుగా ఉంటారు. కొన్ని సంఘాలు సభ్యత్వ రుసుము రూ.20తోపాటు నెలకు రూ.30 నుంచి రూ.60ల వరకు పొదుపు చేసుకున్నాయి. ఆ సొమ్ముతో సమన్వయకర్తల పేరిట బ్యాంకు ఖాతాలు కూడా ప్రారంభించారు. అన్నీ సంఘాల నిర్వహణ ఖర్చులకుగానూ అధికారులు రూ.2,500 మంజూరు చేశారు. అనంతరం క్రమం తప్పకుండా పొదుపు చేసుకుంటున్న రైతుమిత్ర సంఘాలకు రూ.15వేల రివ్వాలింగ్ ఫండ్ మంజూరవుతుందని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ సంఘాలు ఏర్పాటైన ఏడాదికే టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. దీంతో అవి ఉనికిని కోల్పోయాయి.

● **నిరాదరణ, నిర్లక్ష్యం**

ప్రభుత్వ నిరాదరణ, అధికారుల నిర్లక్ష్యంతో రైతుమిత్ర సంఘాలు కనుమరుగయ్యాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి రైతుమిత్ర సంఘాలను తెరపైకి తెచ్చింది. వాటికి జీవం పోసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 50శాతం సబ్సిడీతో యంత్ర పరికరాలను రైతుమిత్ర సంఘాలకు అందచేసింది. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారులు జిల్లాలో రైతుమిత్ర సంఘాల పనితీరును బట్టి గ్రేడింగ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను అందచేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. ఆ తర్వాత రైతుమిత్ర సంఘాల సంగతే మరచిపోయారు.



రైతుమిత్ర సంఘాలకు అందచేసిన పాసుపుస్తకం(ఫైల్)

● **పునరుద్ధరిస్తే సత్ఫలితాలే..**

రైతుమిత్ర సంఘాలను ప్రస్తుత సీఎం చంద్రబాబు పునరుద్ధరిస్తే సత్ఫలితాలు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పొదుపు గ్రూపుల విధివిధానాలను పుణికిపుచ్చుకునేలా రైతుమిత్రల సంఘాల విధివిధానాలను రూపొందించి, రైతులకు చేయూత అందించేలా వాటిని పునరుద్ధరించాలని అన్నదాతలు కోరుతున్నారు.

సంఘాల నిర్వీర్యం తగదు



కూటమి ప్రభుత్వం రైతుమిత్ర సంఘాలను నిర్వీర్యం చేయడం తగదు. వాటిని తిరిగి పటిష్ఠ పరిచేలా దృష్టి సారించాలి. వీటిని బలోపేతం చేస్తే అన్నదాతలు అప్పుల కోసం వెంపర్లాడాల్సిన అవసరం ఉండదు.

- చెరుకూరు రమణయ్యనాయుడు, పొగాకు బోర్డు మాజీ వైస్ చైర్మన్, ఆత్మకూరు

సంఘాలను బలోపేతం చేయాలి



పొదుపు గ్రూపులను బలోపేతం చేసినట్లుగానే రైతు మిత్ర సంఘాలను బలో పేతం చేస్తే రైతులకు ఎంతో లాభం. పంటల సాగుకు, అత్యవసర సమయాల్లో పెట్టుబడుల కోసం రైతులు వెంపర్లాడాల్సిన అవసరం ఉండదు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం రైతు మిత్ర సంఘాలను పునరుద్ధరించాలి.

- పయ్యావుల ప్రభాకర్‌నాయుడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు, అప్పారావుపాలెం

స్మార్ట్ మీటర్లు, సర్వీసులకు రుసుము లేదు

● ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్త సర్వీసులను, స్మార్ట్ మీటర్లను విద్యుత్ శాఖే ఉచితంగా అందిస్తుందని, వాటికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఆ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. ఆయన ఆదివారం కార్యాలయంలో విలేకర్లతో మాట్లా డుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా డబ్బులు అడిగితే ఉన్నతాధికా రులకు వినియోగదారులు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేసి సంస్థకు మంచిపేరు తీసుకురావాలని ఆదేశించారు. వినియోగదారులకు 4కిలోవాట్స్ వరకు సింగిల్ ఫేస్, 5 కిలోవాట్స్ దాటితే త్రీఫేస్ సర్వీసు ఇస్తామని చెప్పారు. గృహాలకు డెవలప్‌మెంట్ చార్జీల కింద ఒక కిలో వాట్‌కు రూ. 1500, ఆ తరువాత ప్రతి కిలో వాట్‌కు రూ.2వేలు, సెక్యూరిటీ డిపాజిట్ కింద కిలో వాట్‌కు రూ.200మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే కమర్షియల్ కనెక్షన్లకు డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2వేలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 800 ప్రతి కిలో వాట్‌కు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. గృహాలకు త్రీఫేస్ కావాల్సిన వారు డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2 వేలు, డిపాజిట్ రూ.200 చెల్లించాలని, దానికి అదనంగా సిబ్బంది అడిగితే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. స్మార్ట్‌మీటర్లు ఉచితంగా అమర్చుతారని, వాటికి ఎటువంటి అదనపు చార్జీలు లేవని ఎస్ఈ స్పష్టం చేశారు.

ఉపాధి సిబ్బందిపై కేసు నమోదు

కలువాయి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలం చిన్నగోపవరం ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన ఉపాధి సిబ్బందిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. ప్రభుత్వ ధనం రూ.58.37లక్షలు దుర్వినియోగానికి కారణమైన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎంపీడీవో నరసింహరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. క్షేత్రసహాయకుడు ఆదిరెడ్డి మహేంద్రరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ పి బాబు రాజేష్, సాంకేతిక సహాయకులు ఆర్ ప్రసన్న, ఎంవీ ప్రసాద్, ఎం వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ (ఇన్‌చార్జ్) జే శీనయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆందోళన చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది



అంబేడ్కర్ వర్సిటీని కొనసాగించాలి

● అడ్మిషన్లు నిలిపేసిన తెలంగాణ ● ఆందోళన చేపట్టిన విద్యార్థులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆ వర్సిటీ జిల్లా కోఆర్డినేటర్ పిచ్చయ్య డిమాండ్ చేశా రు. 2024-25 విద్యా సంవత్సరానికి ఏపీలో అడ్మిషన్లు నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆదివారం నగరంలోని సర్వోదయ కళాశాల ప్రాంగణంలో ఉన్న అధ్యయన కేంద్రం ఎదుట విద్యార్థులు, సిబ్బంది ఆందోళన చేపట్టారు. కోఆర్డినేటర్ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన ఏపీ సార్వత్రిక విద్యాలయాన్ని 1992లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విద్యాలయంగా పేరు మార్పు చేశారన్నారు. వర్సిటీ అడ్మిషన్ పొంది ఇంకా కోర్సు పూర్తి చేయని వారు రాష్ట్రంలో 2 లక్షల మంది ఉండగా జిల్లాలో 10వేల మందికి పైగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలోని అధ్యయన కేంద్రాల నుంచి అడ్మిషన్లు, ఫీజుల రూపంలో రూ.21 కోట్లు తెలంగాణ ప్రభుత్వానికి వెళుతుండగా ఏపీలో పనిచేసే సిబ్బందికి రూ.4 కోట్లు చెల్లిస్తున్నారని చెప్పారు. మూడేళ్లుగా జీతాలు కూడా పూర్తిస్థాయిలో చెల్లించడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి విద్యార్థులు, సిబ్బందికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజనీకుమారి, అధ్యయన కేంద్రాల నిర్వాహ కులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కి కాంగ్రెస్ అవమానం

● వీఆర్సీ సెంటర్‌లో బీజేపీ నిరసన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను వక్రీకరించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ పదే పదే అవమానిస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆదివారం నెల్లూరులోని వీఆర్సీ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భైరి శ్రీనివాస్ మాట్లాడు తూ రెండుసార్లు ప్రత్యక్ష ఎన్నిక ల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానకర రీతిలో ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది కాదా అని ప్రశ్నించారు. అంబేద్కర్ పేరును తమ నీచ రాజకీయాలకు వాడుకుంటున్న రాహుల్ గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పరుశు మధు, నాయకుడు మంద శ్రీనివాసులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశోక్, పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

సోమశిలలో 72.359 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 2,431 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 72.359 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 1,200, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా జరుగుతోంది.

నేడు ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా

నెల్లూరు(విద్య), డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ విభాగం, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో సోమవారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డైకిన్, పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అమర్‌రాజా బ్యాటరీస్, భార్గవి ఆటోమొబైల్స్ వంటి కంపెనీలు పాల్గొని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని తెలిపారు. పదో తరగతి నుంచి ఐటీఐ, డిప్లమో, డిగ్రీ వరకు చదివిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్, బయోడేటా, సర్టిఫికెట్లతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే మేళాలో పాల్గొనాలని కోరారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల ప్రారంభం



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హాజరైన నెల్లూరు జట్టుతో నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయులు

కోవూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 53వ మహిళల హ్యాండ్‌బాల్ పోటీలు ఆదివారం మండలంలోని పాటూరు జడ్పీ హైస్కూల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన టోర్నమెంటు పర్యవేక్షకుడు డాక్టర్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన జట్టు బిహార్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి లోకేష్ క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుందని చెప్పారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. పోటీల నిర్వహణకు ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వరరావు, పీఈటీ టీ.వెంకటరమణయ్యల సహకారం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామదీక్ష మాలధారులు అయోధ్యకు పయనం

కలిగిరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రామదీక్ష చేపట్టిన కలిగిరి, కుమ్మరకొండూరువాసులు దీక్ష విరమణకు ఆదివారం అయోధ్య బయలుదేరారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ అనంతరం స్వామివారి దీక్ష 41 రోజులుగా చేపట్టామన్నారు. వింజమూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఇరుముడులు కట్టుకొని అయోధ్యకు బయలుదేరినట్లు చెప్పారు. అయోధ్యలో రామాలయ నిర్మాణ అనంతరం మొట్టమొదటిసారిగి ఈ ప్రాంతం నుంచి రామమాల వేసి స్వామివారి వద్దకు వెళ్లడం సంతోషంగా ఉందని మాలధారులు పేర్కొన్నారు.



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

కావలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేడ్కర్ మేధస్సును వ్యక్తపరుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాల మాటలను వక్రీ కరించి రాజకీయం చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చర్యలను నిరసిస్తూ ఆదివారం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నేతలు హరిజన, గిరిజన మహిళలతో నిరసన చేపట్టారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం స్థానిక ట్రంకురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి వెంకటేశ్వర్లు మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువస్తోందన్నారు. గత కాంగ్రెస్ పాలనలో అంబేడ్కర్ ఆశయాలను పూర్తిగా విస్మరించిందన్నారు. రాహుల్ గాంధీ ఎన్ని కుయుక్తులు పన్నినా అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదన్నారు. మోదీ, అమిత్‌షాను విమర్శిస్తే కాంగ్రెస్‌కు బీజేపీ తగిన బుద్ధి చెబుతోందన్నారు. కార్యక్రమంలో నేతలు కందుకూరు వెంకటసత్యనారాయణ, గుండ్లపల్లి భరత్ కుమార్, కే బ్రహ్మానందం, సీవీసీ సత్యం, మందా కిరణ్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలి



ర్యాలీలో పాల్గొన్న ఐక్యవేదిక సంఘాల నాయకులు

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవహేళ చూస్తూ మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని ఆదివారం ఉపాధ్యాయ, ఉద్యోగ, కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కందుకూరులో ర్యాలీ చేపట్టారు. జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడారు. దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు చిరంజీవి, కల్లగుంట్ల మోహన్‌రావు, షేక్ అబ్దుల్లా, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, ఎస్‌కే గౌస్, నేతి మహేశ్వరరావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ

● చదును చేసి పంటల సాగు ● అధికారుల ఆదేశాలు బేఖాతరు



భూమిలో దుక్కి చేసిన ఆక్రమణదారులు



సాగులో ఉన్న దోస పంట

ఉదయగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పలుకుబడితో కొంతమంది నాయకులు అధికారులను లోబర్చుకొని రెవెన్యూ రికార్డులను సైతం తారుమారు చేసి ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని తమ స్వాధీనం చేసుకుంటున్న సంఘటనలు నియోజకవర్గ పరిధిలోని వరికుంటపాడు మండలంలో రోజుకో చోట వెలుగు చూస్తున్నాయి. తాజాగా గణేశ్వరాపురంలో అలాంటి ఆక్రమణల పర్వం బట్టబయలవడం గమనార్హం. గ్రామంలోని కొంతమంది న్యాయం చేయాలని కోరుతూ ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో అవినీతి భాగోతం బట్టబయలయ్యింది. గ్రామంలోని 169, 196 సర్వే నంబర్లలో 455.29 ఎకరాల ప్రభుత్వ పశువుల మేత పోరంబోకు ఉంది. వాటిపై కన్నేసిన ఆక్రమణదారులు అందులోని సుమారు 150 ఎకరాల భూములు ఆక్రమించుకున్న కొంతమంది పంటలు సాగు చేసుకుంటుండగా, మరికొంతమంది తమ ఆధీనంలోనే ఉంచుకొని అర్హులకు అవకాశం లేకుండా చేస్తున్నారు. గతంలో కొంత భూమి ఆక్రమణకు గురైన సమయంలో అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇటీవల మరికొంతమంది ఇదే అదునుగా భావించి మరికొంత భూమిని యంత్రాలు, ట్రాక్టర్లతో రాత్రి, పగలు తేడా లేకుండా యధేచ్ఛగా చదును చేసుకొని పంటలు సాగు చేసుకొనేందుకు సిద్ధమవుతుండడం విశేషం. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

సీజేఎఫ్ఎస్ భూములకూ ఎసరే

గ్రామంలోని ఎస్సీలకు గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన సీజేఎఫ్ఎస్ భూములపై కన్నేసిన ఆక్రమణదారులు వాటిని సైతం ఆక్రమించుకునేందుకు తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు. ఆ భూములను 2018లో టీడీపీ ప్రభుత్వం అసైన్‌మెంటు పట్టాలుగా మార్పుచేసి పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఆ తరుణంలో అధికారులను లోబర్చుకున్న ఆక్రమణదారులు అలాంటి భూముల రికార్డులను తారుమారు చేసి ఆక్రమణకు తెరలేపారు. తమ భూములకు ఆనుకొని పశువుల మేత పోరంబోకు, అసైన్‌మెంటు భూములు ఉండడం కొంతమంది ఆక్రమణదారులకు వరంగా మారింది. అధికారుల చర్యలు అంతంతమాత్రంగా ఉండడంతో మరికొంతమంది గ్రామస్థులు గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ఆరా తీసి ఆక్రమించుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఫిర్యాదులతో విచారణ

ఈ నేపథ్యంలో కొంతమంది గ్రామస్థులు కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజకు వరుస ఫిర్యాదులు చేశారు. దీంతో ఆమె తహసీల్దారు, వీఆర్వో, సర్వేయర్లతో గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. భూములను పరిశీలించడంతో పాటు ఆక్రమణదారులను హెచ్చరించారు. అలాంటి వారికి నోటీసులు అందజేసి భూములను స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారుకు సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● హరీష్, నర్రవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి



దుత్తలూరు (ఉదయ గిరి) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులు నివారించవచ్చని నర్రవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి హరీష్ తెలిపారు.

ముఖాముఖి

? సీజనల్ వ్యాధులు ఎలా వస్తాయి.

! తాగునీరు కలుషితం వల్ల జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులతోపాటు వైరల్ ఫీవర్ వస్తాయి. ఇవి రాకుండా వర్షాకాలంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

? సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! పరిసరాలు, డ్రైనేజీలు, మురికిగుంతలు, నిల్వ నీటిలో లార్వా చేరకుండా వైద్యఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం, ఆశ కార్య కర్తలతో పంచాయతీ సిబ్బంది సమన్వ యంతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి శానిటేషన్ కార్యక్రమం చేపడుతున్నాం.

? దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారా.

! వైద్యఆరోగ్య, పంచాయతీల సిబ్బంది సంయుక్తంగా దోమల నివారణ చర్యలు చేపడుతున్నారు. అలాగే దోమలు పుట్టకుండా చర్యలు తీసుకోవడంతోపాటు దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఘనంగా గంధ మహోత్సవం

ఏఎస్ పేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుర్షిద్ అమ్మవారి దర్గా గంధ మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా సజ్జాద మహమ్మద్ ఇంటి నుంచి గంధాన్ని బాణసంచా వేడుకల నడుమ దర్గాకు తరలించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాళ్లపాడు ఆయకట్టులో ప్రతి ఎకరాకు సాగునీరిస్తాం



తూము పనుల పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ శ్రీపూజ

లింగసముద్రం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో రైతులు సాగుచేసిన ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తా మని నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 7వరకు ఆయన నీటి సరఫరా పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రైతు లకు సాగునీరు ఇచ్చేందుకు ఎంత ఖర్చునైనా ప్రభుత్వమే భరిస్తుందని ఈ మేరకు జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారని తెలిపారు. 15రోజుల క్రితం దెబ్బతిన్న స్టాప్‌లాక్ గేటు బాగు చేసేందుకు అధికారులు, బెకాం ప్రతినిధులు కృషి చేశారని, చివరిగా మెఘా కంపెనీ ప్రతినిధులు మోటార్లు తెచ్చి నీరు ఇచ్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. అయితే ప్రతిపక్షాలు ప్రతీది రాజయకీయం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఇరిగేషన్ సీఈ శ్యాంప్ ప్రసాద్, ఎస్ఈ పీ వరలక్ష్మి, డీఈ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ భారతీయ సంస్కృతికి ప్రతిబింబం



మంచిమాట కార్యక్రమంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని తెలుగు భారతి సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో ఆదివారం తెలుగు భారతి సేవాసమితి ఆధ్వర్యంలో మంచి మాట కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కుటుంబం గురించి చర్చించారు. ఈ సందర్భంగా ప్రగతి ఆంగ్ల మాధ్యమ పాఠశాల కరస్పాండెంట్ ఎస్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబంలో సభ్యుల మధ్య ప్రేమ, అనుబంధాలు బలంగా ఉంటాయన్నారు. ఉమ్మడి కుటుంబంలో వనరుల సమర్థ వినియోగం ద్వారా ఆర్థిక సమస్యలు తేలికగా పరిష్కారమవుతాయని వివరించారు. ఆధునిక కాలంలో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు ఏ గోవిందరెడ్డి, సహాయ ప్రధాన కార్యదర్శి జి రామిరెడ్డి, గౌరవ సలహాదారులు ఎస్‌వి రమణయ్య, కెవి శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలిజల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెలిశెట్టి శ్రీహరి రాయులు

కావలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బలిజల ఆత్మగౌరవ సభ ఈ నెల 29న నెల్లూరు కాపు (బలిజ) భవనంలో నిర్వహించనున్నట్లు ఆ సభను జయప్రదం చేయాలని రాయలసీమ బలిజ మహాసభ అధ్యక్షుడు వెలి శెట్టి శ్రీహరి రాయులు పిలుపునిచ్చారు. ఈ విషయంపై స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య, స్థానిక కాపునేతలతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కాపునాడు పూర్వపు ఛైర్మన్ మిరియాల వెంకట్రావు 85వ జయంతి, వంగవీటి మోహన్ రంగారావు 36వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ ఆత్మగౌరవసభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణతో పాటు, ప్రస్తుత కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బరాయుడు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాపు రాష్ట్రస్థాయి ప్రముఖులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బలిజ పేద మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు, టాలెంట్ అవార్డులు, బలిజబంధు పురస్కారాలు, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో బలిజలందరూ పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాపు నేతలు నువ్వుశెట్టి జనేష్, పాలడుగు వెంకటేశ్వరరావు, తోట ప్రభాకర్‌రావు, పసుపులేటి శ్రీనివాసులు, కేశవరావు, తోకల వెంకటేశ్వర్లు, ఉమా రాజు రాయల్ పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం నిత్య పోరాటం

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళల రక్షణ, వారి హక్కులను కాపాడటంలో ముఖ్యపాత్ర పోషించి పోరాటాలు చేసేది ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మాత్రమే అని రాష్ట్ర మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మీ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయ ఆవరణలో ఆదివారం కారంశెట్టి ఇంద్రజ అధ్యక్షతన జరిగిన మండల జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథులుగా జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, జయలక్ష్మీ పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం సనాతన ధర్మాన్ని తీసుకురావాలని ప్రయత్నాలు చేస్తుందని దీన్ని అరికట్టాల్సి బాధ్యత అందరిపై ఉందని, మహిళలు సొంతంగా ఆలోచించే హక్కును కోల్పోవడంతో పాటు మహిళ ఇంటి నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడిందని సమావేశంకు వచ్చిన పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కార్యదర్శి సుదర్శి రావమ్మ, రావులకొల్లు లక్ష్మీ, బూసి సురేష్‌బాబు, యర్రంశెట్టి ఆనందమోహన్, శైలజ, కల్పన, జ్యోతి పాల్గొన్నారు.

ఘటిక సిద్దేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే కాకర్ల



సీతారామపురం : కాకర్ల సంహిత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు, నేతలు

సీతారామపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనయుడు సంహిత్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని సిద్దేశ్వరంలోని ఘటిక సిద్దేశ్వరస్వామి, ఇష్టకామేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి భోగినేని కాశీరావు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు షేక్ బాబు, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక ప్రతినిధి తురక వెంకటేశ్వరు, భోగినేని కాశీరత్తయ్య(గాంధి), ఎడమ ప్రవీణ్, పిడుగు రమేష్, విక్కీబాబు, విజయ్, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● వేంకటేశ్వరస్వామి సేవలో...

వింజమూరు: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనయుడు కాకర్ల సంహిత్ పుట్టినరోజు సందర్భంగా వింజమూరులోని తిరుమలనగర్‌లో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కుటుంబ సభ్యులు, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, భాష్యం నరసింహులునాయుడు, మనోప్రకాష్, దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు జూపల్లి వెంకటేశ్వర్లు, మధురెడ్డి, వెంగపనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మత ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో మతప్రచారం చేసిన, ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య, శ్రీనివాసరావు, కోశాధికారి రఘు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హేతుబద్ధంగా ఉండాల్సిన అధికారులు మత పరమైన కార్యక్రమాలు వారి ఇళ్ల వద్ద చేసుకోవాలన్నారు. ఈనెల 21న నెల్లూరు మున్సిపల్ కార్యాలయంలో క్రిస్మస్ ముందస్తు సంబరాలు నిర్వహించగా అందులో నగర మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజ, అదనపు కమిషనర్ నందన్ పాల్గొని క్రీస్తు బోధనలు, కీర్తనలు చేయడం తగదన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కూడా ఓ క్రిస్టియన్ మత పెద్దలతో కార్యక్రమం జరపనున్నట్లు సమాచారం ఉందని అలాంటి కార్యక్రమాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఉలవపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కొల్లారుపాడు ఎస్సీ కాలనీకి చెందిన సుదర్శి వేణు (35) ఆదివారం విద్యుదాఘాతంతో మరణించాడు. బంధువులు చెప్పిన వివరాల మేరకు.. ఉదయం 10గంటల సమయంలో గేదెలకు మేత కోసమని ఇంటి నుంచి బయలుదేరాడు. సాయంత్రం 6గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడం, ఫోన్ స్విచ్‌లో ఉండటంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అంకమ్మ సిబ్బందితో కలిసి ఆవులబాటలోని సపోట తోటలో టార్చిలైట్స్ వెలుగులో వెతగ్గా విగతజీవుడిగా పడి ఉన్న వేణుని గుర్తించారు. పరిసర ప్రాంతాన్ని పరిశీలించగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తాకి మృతి చెంది ఉంటాడని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి రజిత భార్య ఉన్నది. వేణు మృతితో ఎస్సీ కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోండి

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పందలపాడు సమీపంలోని పాలేరువాగులో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పందలపాడు గ్రామస్థులతో కలిసి కలెక్టర్ ఆనంద్‌కు సూచించారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గానికి చెందిన వ్యక్తులు పెద్దఎత్తున ఇసుక రవాణా చేస్తున్నారని తెలిపారు. రవాణాకు వీలుగా నదీలో రోడ్డు నిర్మాణం వేయడంతో పాటు, ఎక్స్‌కవేటర్లతో ఇసుకను టిప్పర్లకు లోడు చేసి తరలిస్తున్నారని చెప్పారు. దీంతో ఆయన వారితో కలిసి తక్షణం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లిలో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నూతనంగా మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు కూటమి నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు పత్తి జానీ, నూల మాల్యాద్రి, కోలా నాగరాజు, కాకుమాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల ఎనిమిది మంది మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10వేల వంతున ఆదివారం శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు వీడ్కోలు

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి నేషనల్ కెడెట్స్ ట్రూప్ 34(ఏ) బెటాలియన్ పరిధిలోని ఉత్తమ సాధనలో బెస్ట్ టీంగా పేరుపొందినట్లు సుబేదారు ఇంద్రజిత్ ప్రశంసించారు. ఫైనల్‌ఇయర్ విద్యార్థుల ఎన్‌సీసీ ట్రూప్‌కి జూనియర్ ట్రూప్‌లు ఆదివారం వీడ్కోలుసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి ట్రెక్కింగ్‌కు ప్రకాశం కాలేజి విద్యార్థులు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. యుద్ధభూమిలో మరణించిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ విజయ్ శ్రీనివాస్, సుధీర్ పాల్గొన్నారు.

పాఠశాల భవనాలకు ఉచితంగా రంగులు

ఉలవపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనానికి ఇండిగో పెయింట్స్ డీలర్, పూర్వ విద్యార్థి మనోజ్ సంస్థ ప్రతినిధులను ఒప్పించి ఉచితంగా రంగులు వేయించినట్లు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో శివనాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఇండిగో పెయింట్స్ కంపెనీ మేనేజర్ మల్లికార్జున రెడ్డి మాట్లాడారు. ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల భవనానికి ఉచిత పెయింట్స్ అందించేందుకు ఉలవపాడును ఎంచుకున్నట్లు తెలిపారు. పెయింటర్స్‌కి బహుమతులు, కంపెనీ తరుపున బీమా సౌకర్యం కల్పించామన్నారు. ఈ సందర్భంగా మనోజ్, కంపెనీ ప్రతినిధులను ఘనంగా సత్కరించినట్లు ఆంగ్ల ఉపాధ్యాయుడు సుధాకర్ తెలిపారు.

న్యూస్ బాక్స్

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సంగం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

బిట్రగుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాతబిట్రగుంట ద్వారకా నగరులోని శేష సాయినాథుడి మందిరంలో ఆదివారం ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో సాయిబాబాకు అభిషేకాలు, నగర సంకీర్తన, భజనలు చేశారు. మందిర వ్యవస్థాపకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, వసుందర దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా గణిత దినోత్సవం

అనంతసాగరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో ఆదివారం గణిత దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడినరవ ఎస్సీ కాలనీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం వితంతు మహిళలకు దాతలు చీరలు పంపిణీ చేశారు. సమీప గండిపాళెం గ్రామానికి చెందిన బీఎస్ ఎలక్ట్రికల్ దుకాణ యజమాని గొల్లపల్లి భాస్కర్, స్వరూపరాణి దంపతులు క్రిస్మస్ పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకొని తమవంతు చేయూతగా పేదలకు చీరలను అందజేసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ఆనందంగా నిర్వహించుకోవాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వింజమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం తరపున 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, సుప్రజ, హేమలత, ఉమా, సుభద్ర, పెంచలమ్మ, స్వరాజ్యం, జానకిరామిరెడ్డి, రవిచంద్ర, అంకిరెడ్డి, సుబ్బారెడ్డి, తదితర 40 మంది ధ్యానులు పాల్గొన్నారు.

రక్తదాతలకు బహుమతులు

అనంతసాగరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం రెడ్‌క్రాస్, జేవీవీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. పలువురు దాతలు రక్తదానం చేశారు. అనంతసాగరం పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఉద్యోగి సుబ్బమ్మ దాతలకు బహుమతులు అందజేసి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు సుధాకర్, వేము పెంచలయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ఏఎస్ పేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌కి చెందిన సయ్యద్ నజీర్ కుటుంబ సభ్యులతో సుమారు వారం క్రితం ఏఎస్ పేట దర్గాకు విచ్చేశారు. నజీర్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో దర్గా వద్దే ఉంటున్నారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం నుంచి నజీర్ కనబడకుండా పోయాడు. దీంతో వారి కుటుంబ సభ్యులు దర్గా కార్యాలయంలో, ఏఎస్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో సినిమా చిత్రీకరణ జరగాలి

- సినీ నటుడు గౌతమ్ రాజు
- 'మా' నెల్లూరు శాఖ ఏర్పాటు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో సహజ వనరులున్న ఆంధ్ర ప్రదేశ్‌లో సినిమా షూటింగులు జరగాలన్నదే తమ లక్ష్యమని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) - ఏపీ సంయుక్త కార్యదర్శి, సినీ నటుడు గౌతమ్ రాజు తెలిపారు. తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత ఆంధ్రలో సినిమా షూటింగులతో కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేందుకే మా-ఏపీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఆదివారం నెల్లూరులోని 25 కళా సంఘాల స్టూడియోలో మా-ఏపీ నెల్లూరు శాఖను ఏర్పాటు చేసేందుకు ఆయన వచ్చారు. నెల్లూరు శాఖ అధ్యక్షుడిగా దోర్నాల హరిబాబు, గౌరవ అధ్యక్షుడిగా అమరావతి కృష్ణారెడ్డిని నియమిస్తూ వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌రాజు మాట్లాడుతూ ఎప్పటి నుంచో ఉన్న 'మా' తెలంగాణకే పరిమితమైందన్నారు. సభ్యత్వ రుసుం లక్ష దాటిందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే వారు హైదరాబాద్‌లో ఆర్టిస్టు కావాలంటే అనేక వ్యయప్రయాసలకు ఓర్చుకోవాల్సి వస్తోందని చెప్పారు. అందుకే ఇక్కడ 'మా' ఏర్పాటు చేశామని, జిల్లాల వారీగా శాఖలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సినిమా అసోసియేషన్ అధ్యక్షుడు శివవెంకట జనార్ధన్, కార్యదర్శి గానుగుంట రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గౌతమ్ రాజు నుంచి నియామక పత్రాలు అందుకుంటున్న దోర్నాల హరిబాబు, అమరావతి కృష్ణారెడ్డి

వైభవంగా మృత్యుంజయ, సుదర్శన హోమాలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్వామి అయ్యప్ప దేవస్థానంలో లోకకల్యాణం కోసం ఆదివారం ఉదయం మహా మృత్యుంజయ హోమం, రాత్రి సుదర్శన హోమం నిర్వహించారు. కేరళ సంప్రదాయంలో తంత్రి హరి నంబూద్రి ఆధ్వర్యంలో కేరళ రుత్వికులు ఈ హోమాలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఆలయంలో జరుగుతున్న మండల పూజల్లో ఉదయం పాలాభిషేకం, గణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, నవకాభిషేకం, అన్నప్రసాద వితరణ జరిగాయి. ఉభయకర్తలుగా ఏసీ మార్కెట్ వ్యాపారులు కేటీఎం వెంకటేశ్వర్లు, హారిక, మాలెం సుధీర్‌రెడ్డి, ఆశా దంపతులు, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, నిరూష దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలోని గురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. విశేష పూజలు, ప్రాకారోత్సవం నిర్వహించారు.


సుదర్శన హోమం నిర్వహిస్తున్న కేరళ నంబూద్రి

వేమిరెడ్డి దంపతుల విరాళం

అయ్యప్ప గుడిలో జరుగుతున్న సహస్ర కలిశాభిషేకం, మహామృత్యుంజయ, సుదర్శన హోమాలకు నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు రూ.5లక్షల విరాళం అందించారు. ఈ మొత్తాన్ని ఆదివారం వారి నివాసంలో ఆలయ చైర్మన్ శేషగిరిరావు, కమిటీ సభ్యులకు అందజేశారు.

ఇళ్ల మధ్య వేబ్రిడ్జిని తొలగించండి

- స్థానికుల ఆందోళన


వేబ్రిడ్జి వద్ద స్థానికులను విచారిస్తున్న పోలీసు

పొదలకూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన పట్టణంలోని మనుబోలు రోడ్డులో ఇళ్ల మధ్య ఇటీవల ఏర్పాటు చేసిన వేబ్రిడ్జిని అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం వేబ్రిడ్జి వద్ద ఆందోళన చేసి నిర్వాహకులతో వాదనకు దిగారు. అనంతరం వేబ్రిడ్జి యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఈ వేబ్రిడ్జి వల్ల నిత్యం ప్రమాదాలు జరగడమేకాక అధిక లోడుతో వస్తున్న లారీల వల్ల రోడ్డు సైతం దెబ్బతింటుందని వాపోయారు. పలుమార్లు అధికారులకు అర్జీలు సమర్పించిన ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదని ఆరోపించారు. విద్యార్థులు స్కూళ్లకు పోవాలన్నా, స్థానికులు బయటకు వెళ్లాలన్నా ఆ వేబ్రిడ్జి వద్ద ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయమేస్తుందన్నారు. ఈ సమస్యపై వారం క్రితం జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు లోడుతో అటువైపు తిరుగుతుండడంతో ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. ఇదేమని అడిగితే లారీ డ్రైవర్లు గొడవకు దిగుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇళ్ల మధ్య ఉన్న లారీ కాటాను ఊరికి దూరంగా మార్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని వేడుకుంటున్నారు.

వరుసగా నాలుగు వాహనాల ఢీ


ఒకదాని వెనుక ఒకటి ఢీకొన్న కార్లు, టిప్పరు

మనుబోలు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కళ్లు మూసి తెరిచేలోగా బండెనుక బండి వరుసగా నాలుగు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటన ఆదివారం కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. వంతెన దెబ్బతినడంతో కొద్దిరోజులుగా ఐజేఎం సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. దీంతో ఒకే మార్గంలో మాత్రమే వాహనాలు వదులుతున్నారు. ఈ వంతెనకు ముందు భారీ గుంత ఉంది. వేగం గా వస్తున్న కారు గుంతవచ్చేసరికి డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వరుసగా వస్తున్న కార్లు ఒకదానికొకటి ఢీకొట్టుకున్నాయి. ఆవెనుక వస్తున్న టిప్పర్ కారును ఢీకొట్టింది. దీంతో ఓ కారు బాగా దెబ్బతినింది. ఒకే మార్గం కావడం తో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ శివరాకేష్ అక్కడకు చేరుకుని కార్లను, టిప్పర్‌ను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వేమిరెడ్డి దంపతుల చిత్రపటాలకు పాలభిషేకం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేన్సర్, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న బుచ్చికి చెందిన నిమ్మల ఉమకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల సహకారంతో తిరుపతిలోని సిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. దీనితో ఆమె కుమారుడు, బీసీ సేన జిల్లా అధ్యక్షుడు నిమ్మల నాగార్జున యాదవ్, అతని భార్య అనూష, కుటుంబ సభ్యులు ఆదివారం బుచ్చిలో వేమిరెడ్డి దంపతుల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఓవైపు కేన్సర్, మరోవైపు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తన తల్లి ప్రాణాలపై ఆశలు వదులుకుని చివరి ప్రయత్నంగా వేమిరెడ్డి దంపతుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు స్పందించి స్విమ్స్ వైద్యులతో మాట్లాడడంతో అక్కడ చేర్పించగా మెరుగైన వైద్యం అందించి 4రోజుల క్రితం శస్త్ర చికిత్స చేశారన్నారు. వేమిరెడ్డి దంపతుల సహాయ, సహకారాలకు తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు టీ.వెంకటేశ్వర్లు, ఆర్.లక్ష్మణ్‌రావు, ప్రభాకర్, కరీమ్, వంశీ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్రన్ చానెల్ బిట్-2 చైర్మన్‌కి సన్మానం

విడవలూరు, డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): ఈస్ట్రన్ చానెల్ బిట్-2 చైర్మన్‌గా ఎన్నికైన పాశం శ్రీహరిరెడ్డిని ఆదివారం రైతులు ఘనంగా సన్మానించారు. ఆయన నివాసంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాశం శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాల తో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా కృషి చేస్తామన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐ టీడీపీ సత్యవోలు సత్యంరెడ్డి, రైతులు దాసరి విజయకుమార్, మొర్ల శివ, బండ్ల బాబయ్య, మడపర్తి కృష్ణమూర్తి, పసుపులేటి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కారుబోల్తా - ఒకరికి తీవ్రగాయాలు


బోల్తాపడి దెబ్బతిన్న కారు

మనుబోలు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గూడూరు పెద్దమసీదువీధికి చెందిన జహీరున్నీసా, ఆమె కుమారుడు వశీం కారులో నెల్లూరుకు ఆసుపత్రికి వెళ్లి తిరిగి గూడూరుకు వస్తుండగా కారు స్టీరింగ్ రాడ్డు దెబ్బతినడంతో అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో కారు నుజ్జునుజ్జు అయింది. జహీరున్నీసాకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థుల్లో గణితంపై మక్కువ పెంచాలి

- విశ్రాంత ప్రిన్సిపాల్ రమేష్

నెల్లూరు(విద్య), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో గణితంపై మక్కువ పెంచేలా గణిత ఉపాధ్యాయులు కృషి చేయాలని డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పీ రమేష్ అన్నారు. చెముడుగుంటలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రమేష్ మాట్లాడుతూ నిత్య జీవితంలో, ఇతర శాస్త్రాలను సమన్వయం చేయడంలో గణితం ప్రధాన పాత్ర వహిస్తుందని చెప్పారు. ప్రకృతి భాషలో గణితం చెప్పగలిగితే చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డీ కరుణాకర్ రెడ్డి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి టీవీ రామకుమార్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఎస్ నరసింహమూర్తి, ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ రమేష్

- నగరంలోని విశ్వసాయి విద్యాసంస్థల్లో గణిత దినోత్సవం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణితశాస్త్రంలో చేసిన సేవలను స్మరించుకుంటూ విద్యార్థులు ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కృష్ణమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అందరికీ 'విశ్వకర్మ' అందేలా కృషి

- విశ్వ బ్రాహ్మణ సంఘం నేత వెంకటశేషయ్య


లబ్ధిదారులకు పనిముట్లు అందచేస్తున్న వెంకట శేషయ్య ఆచారి, గోకవరపు శ్రీనివాసులు ఆచారి తదితరులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ పథకం లబ్ధి అందరికీ అందేలా చేస్తామని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి చెప్పారు. నగరంలోని కామాటి వీధిలో ఉన్న కృష్ణమందిరం కల్యాణ మండపంలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. శేషయ్య మాట్లాడుతూ 'విశ్వకర్మ' పథకానికి జిల్లాలో అనేక మంది నమోదు చేసుకున్నారని, కానీ కొద్ది మందికే రుణాలు, పనిముట్లు వచ్చాయని చెప్పారు. ఈ విషయమై త్వరలో కలెక్టర్‌కు విన్నవిస్తామని చెప్పారు. అనంతరం అత్యాధునిక వడ్రంగి పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి గోకవరపు శ్రీనివాసులు ఆచారి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మేడపి ప్రసాద్ ఆచారి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కల్లూరు శ్రీవాణి, శారద, జిల్లా ప్రధాన కార్యదర్శి తల్లాం సురేష్ ఆచారి, ఉపాధ్యక్షుడు వేములూరు రఘురామయ్య ఆచారి, శ్రీమంతుల రఘునాథ్ ఆచారి, కందుకూరు మోహన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): అతి వేగంగా బైక్‌పై వెళుతూ స్పీడ్ బ్రేకర్‌ను ఎక్కించడంతో బైక్ వెనుక కూర్చున్న మహిళ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు, కర్నాటక రాష్ట్రం మైసూర్‌లో షేక్ ముంతాజ్ (37) తన కుమారుడు తారీఖ్‌తో కలిసి ఉంటోంది. ఈనెల 17న ఆమె బుజబుజ నెల్లూరులోని తన చెల్లెలు నాగూర్‌బీ వద్దకు వచ్చింది. ఆదివారం తెల్లవారుజామున ముంతాజ్, తారీఖ్‌తో కలసి బైక్‌పై వెళ్లి మైపాడు గేటు సెంటర్‌లో స్నేహితురాలు వరలక్ష్మిని కలిసి బుజబుజనెల్లూరుకి బయలుదేరింది. తారీఖ్ బైక్‌ను వేగంగా నడుపుతూ నారాయణ కాలేజీ వద్ద స్పీడ్ బ్రేకర్‌ను ఎక్కించాడు. బైక్ అదుపుతప్పడంతో ముంతాజ్ కిందపడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ విషయాన్ని తారీఖ్ తన పిన్ని నాగూర్ బీకి తెలియజేశాడు. ఆమె ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేశారు.

వైద్యానికి అత్యంత ప్రాధాన్యం

- అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి


మందులు పంపిణీ చేస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ పాలనలో వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. ఆదివారం నగరంలోని కోటమిట్ట షాదీ మంజిల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. మందులు పంపిణీ చేశారు. అజీజ్ మాట్లాడు తూ గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకం వద్దని వెళ్లి పోయిన ఆసుపత్రులు ఈ ప్రభుత్వంలో మరలా ఉచిత వైద్య చికిత్సలు అందించేందుకు ముందుకు వస్తున్నాయని చెప్పారు. కోటంరెడ్డి మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జకీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మొయినుద్దీన్, కువ్వారపు బాలాజీ, ఉస్మాన్, రబ్బానీ, నౌషాద్, ఇంతియాజ్, రెయిన్‌బో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా రంగంలో 'నారాయణ' బ్రాండ్

- నీట్ సక్సెస్ మీట్‌లో జీఎం వీబీఆర్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో నారాయణ విద్యాసంస్థలు ఓ బ్రాండ్‌లా వెలుగుతున్నాయని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నీట్ సక్సెస్ మీట్ ఆదివారం నగరంలోని నారాయణ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నీట్‌లో తమ విద్యార్థులు 350 మందికి మెడికల్ సీట్లు వచ్చాయని చెప్పారు. ఉత్తమ బోధన, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మెటీరియల్, నిరంతర పర్యవేక్షణతోనే ఇది సాధ్యమయిందన్నారు. నీట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని సన్మానించారు. విద్యార్థులు నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, డీజీఎం మధుసూదన్‌రెడ్డి, డీన్ వర్ధిని, తదితరులు పాల్గొన్నారు.

వేదగిరీశుడి సేవలో చిన్న ఆండవన్ స్వామి


వేదగిరి క్షేత్రంలో చిన్న ఆండవన్ స్వామి

నెల్లూరు రూరల్/బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీరంగం శ్రీమద్ పవరక్కోటై 11వ పీఠాధిపతి చిన్న ఆండవన్ స్వామి ఆదివారం నెల్లూరు రూరల్ మండలంలోని వేదగిరి లక్ష్మీనరసింహ స్వామిని, బుచ్చి మండలం జొన్నవాడలోని వరదరాజస్వామిని దర్శించుకున్నారు. పీఠాధిపతికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి ఆలయా ల విశిష్టతను తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందచేశారు. కాగా, వేదగిరి క్షేత్ర దర్శనానికి వచ్చిన విద్యార్థులకు స్వామి వారు హయగ్రీవ స్తోత్రం వినిపించారు.

ప్రజల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంతోషమే లక్ష్యంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం 35వ డివిజన్ నీలగిరి సంఘంలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల ప్రచార కరపత్రాలను ప్రజలకు అందచేశారు. స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అద్వైత్ భారత్ నవల ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చతుర్వేదుల చెంచు సుబ్బయ్య శర్మ రచించిన అద్వైత్ భారత్ నవలను నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. భిన్నత్వంలో ఏకత్వం అన్న అంశం మీద ఈ నవల రచించారని, విద్యార్థులకు ఉపయుక్తమైన సమాచారం ఇందులో ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. రచయిత చెంచుసుబ్బయ్య శర్మ, గోవింద రాజు సుభద్రాదేవి, అవ్వారు శ్రీధర్‌బాబు, చిన్ని నారాయణరావు, పొట్లూరు సుబ్రహ్మణ్యం, గంగిశెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తోట సులోచన, చీమకుర్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కాగా, ఇంజనీర్ వెంకటేశ్వరరావు జిల్లా గ్రంథాలయంలో కుర్చీల ఏర్పాటుకు రూ.5.116 విరాళం అందజేశారు.

విద్య, వైద్య ప్రోత్సాహకాల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో ఆదివారం విద్యా వైద్య ప్రోత్సాహకాల పంపిణీ జరిగింది. చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో 29 మంది నిరుపేద విద్యార్థులకు రూ.2.80లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇద్దరికి వైద్య సహాయం కోసం 10వేలు చొప్పున రూ.20వేలు అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు ఆనందకుమార్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ నిధులతోపాటు 12 మంది దాతలు ఇచ్చిన విరాళాలతో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఎం ఉదయకుమార్ శర్మ, ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, ఆడిటర్ సూర్యనారాయణ, జయప్రకాష్, డాక్టర్లు సుదర్శన్‌రెడ్డి, కార్తీక్, డాక్టర్ చక్రధర్‌రావు, జయలక్ష్మి, సమయానందనాథ పాల్గొన్నారు.

సీఎంఆర్ వీక్లీ డ్రా విజేతలు ధన్విక, సుజిత

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో ఆదివారం రాత్రి చందన, సీఎంఆర్ ఎక్స్‌ప్రెస్ సేల్స్ లక్కీ డ్రాలు జరిగాయి. ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ ఆరోగ్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ జడ్ శివప్రసాద్ హాజరయ్యారు. వీక్లీ డ్రా తీసి నెల్లూరు సంతపేటకు చెందిన ధన్విక్ (కూపన్ నెంబరు 35664), 4వమైలు మైపాడు రోడ్డుకు చెందిన వై సుజిత (కూపన్ నెంబరు 77119)ను టీవీఎస్ స్కూటీ విజేతలుగా ప్రకటించి అభినందించారు. డైలీ డ్రా 70 మంది విజేతలకు మిక్సీలు, గ్రైండర్లు, ఎలక్ట్రికల్ ఫ్రైడయర్లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు, డిన్నర్‌సెట్లు అందజేశారు. ప్రజాదరణ పొందిన సీఎంఆర్ - చందన యాజమాన్యం పండుగల సందర్భంగా విలువైన బహుమతులు, బంపర్ డ్రాలో కార్లు అందిస్తున్నందుకు అభినందించారు. సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ సేల్స్ సంక్రాంతి వరకు ఉంటుందని తెలిపారు. ప్రతీరోజు డ్రా, వీక్లీ డ్రా, క్రిస్మస్, న్యూయర్, సంక్రాంతికి బంపర్ డ్రాలో కార్లు అందజేస్తున్నామని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజీ యాడ్స్, పెంచలయ్య, ఎం సంతోష్, శైలేష్ పాల్గొన్నారు.



విజేతకు స్కూటర్ కీ అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి, శివప్రసాద్, మావూరి శ్రీనివాసరావు తదితరులు

పెన్నా డెల్టా చైర్మన్‌కి పలువురి అభినందనలు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పెన్నా డెల్టా డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన జెట్టి రాజగోపాల్‌రెడ్డిని ఆదివారం నెల్లూరులోని ఆయన నివాసంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయనను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. రాజగోపాల్‌రెడ్డిని సన్మానించిన వారిలో టీఎస్ హరి, వాయుగుండ్ల రమేష్, వి.సుధాకర్‌రెడ్డి, ఆర్ సుబ్బారెడ్డి, పి.సునీల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులున్నారు.


రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

న్యూస్ బాక్స్

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. కమిటీ సభ్యులు ఉండ్రాళ్ల స్వాతి మహాత్మాగాంధీ, ఆశ్రమ స్థలదాత పొనక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. అనంతరం ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల స్కూల్ విద్యార్థులకు మహాత్మా గాంధీ ఆశయాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ప్రహరీ కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు

పొదలకూరు, డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని డీఎన్నార్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ కొంత భాగాన్ని శనివారం కొందరు కూల్చివేశారని ఆ స్కూల్ హెచ్ఎం పెర్సిస్ ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ముగిసిన తర్వాత సాయంత్రం గోడను ఎక్స్‌కవేటర్‌తో కూల్చి మట్టిని కూడా బయటకు తరలించారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా తెల్పిన ట్లు వెల్లడించారు. అయితే ఈ ప్రాంతంలో స్థలంపై గత 26 ఏళ్లుగా వివాదంలో ఉంది. రామ్‌నగర్ గేటు సెంటర్ యువకులు కొందరు ప్రస్తుతం గోడ కూల్చిన ప్రాంతానికి పక్కనే వినాయకుడి ఆలయాన్ని నిర్మించారు. ఈ స్థలం తమదేనని పట్టణంలోని ఓ కుటుంబం ఆధారాలను చూపుతోంది.

కసుమూరులో భక్తుల రద్దీ

వెంకటాచలం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మస్తాన్ వలీ దర్గాను సందర్శించారు. కొందరు భక్తులు షాఫాబావిలో పుణ్య స్నానాలు అచరించి మస్తాన్ స్వామి దర్గాను దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించగా మరికొందరు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ స్వామి దర్గాను పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

జనసేన జెండా ఆవిష్కరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 10వ డివిజన్ ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఆదివారం జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ జిల్లా నాయకుడు నూనె మల్లికార్జునయాదవ్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాలనకు రాష్ట్ర ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. నాయకులు సుందర్రామి రెడ్డి, గునుకుల కిషోర్, లాయర్ శ్రీరామ్, కృష్ణారెడ్డి, వై.రవి, ముదిరాజ్ శ్రీను, పాల్గొన్నారు.

25న బౌద్ధధర్మ స్వీకార మహోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ధర్మపోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 25న నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో నవయాన బౌద్ధ ధర్మ స్వీకార మహోత్సవం జరుగుతుందని అంబేడ్కర్ ధర్మపోరాట సమితి వ్యవస్థాపకుడు ఇంగిరాల రామచంద్రరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10 కుటుంబాలకుపైగా బౌద్ధ ధర్మం స్వీకరిస్తున్నాయని తెలిపారు.

ఫ్రెండ్స్ వాకర్స్ కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(విద్య), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శిగా గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారిగా మాగంటి ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా తలపనేని హరిబాబును ఎన్నుకున్నారు. వినుకొండ వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, సభ్యులు పీ శ్రీనివాసులు రెడ్డి, బీ రామ్మోహన్‌రెడ్డి, షేక్ నసీర్ అహ్మద్, సుబ్బరాయుడు పర్యవేక్షించారు.


లక్ష్మి

బిడ్డలను చదివించుకోవాలని కష్టపడి కువైట్‌కు వెళ్లిన మహిళకు కష్టాలు మిగిలాయి.గొడ్డు చాకిరీ చేసినా కనికరంలేదు. కడుపునిండా తిండిలేదు. కంటినిండా కునుకు లేదు. ఒక్క పూట భోజనం, గ్లాసు మంచినీళ్లతో మూత్రంలో రక్తస్రావమవుతూ నరకం అనుభవిస్తోంది శ్రీకాళహస్తికి చెందిన ఓ మహిళ.

కువైట్‌లో శ్రీకాళహస్తి మహిళ ఆవేదన

నన్ను చంపి ఎడారిలో పడేస్తామంటున్నారు

- మూత్రంలో రక్తం వస్తోంది
- ప్రతిక్షణం నరకం అనుభవిస్తున్నా

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం రాజీవ్ నగర్‌కు చెందిన ఎల్లంపల్లి లక్ష్మి ఆర్థిక ఇబ్బందులతో బిడ్డల చదువుకోసమని కువైట్‌కు వెళ్లారు. అక్కడ ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను సెల్ఫీ వీడియోలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'నా పేరు లక్ష్మి. కువైట్‌లో ఇరుక్కుపోయాను. రూ2.5లక్షలు కడితేనే ఇండియాకు పంపుతామంటున్నారు. ఘోరంగా కొడుతున్నారు. ఏజెంట్ దగ్గరకు వెళ్లి చెబితే ఇక్కడే నిన్ను చంపి ఎడారిలో వేసేస్తాం అని బెదిరిస్తున్నారు. నా ఆరోగ్యం సహకరించడంలేదు. మూత్రానికి బదులు రక్తం వస్తోంది. ఇంటికి ఫోన్ చేసుకునే అవకాశం ఇవ్వడంలేదు. బయటకు రాకుండా బీగాలు వేసేశారు. నన్ను ఎలాగైనా ఇండియాకు పంపండి' అని సెల్ఫీ వీడియో ద్వారా లక్ష్మి వేడుకున్నారు.

తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం

శ్రీకాళహస్తికి చెందిన లక్ష్మిని ఇండియాకు పంపే ప్రయత్నం చేస్తున్నాం. ఆమె కువైట్‌లో ఇబ్బందులు పడుతున్నట్టు మాదృష్టికి వచ్చింది. ఏజెంట్లతో మాట్లాడుతున్నాం. రూ2.5లక్షలు అడుగుతున్నారు. తెలుగు ఎన్ఆర్ఐల సహకారం తీసుకుంటున్నాం.

- డాక్టర్ ముక్కు తులసీకుమార్, ఏపీఎన్ఆర్టీ యూఏఈ మాజీ ఇంచార్జి

మా అమ్మను రప్పించండి సారూ..

కువైట్‌లో నరకయాతన అనుభవిస్తున్న తమ అమ్మను తీసుకురావాలని సుచిత్ర కన్నీటి పర్యంతమవుతోంది. తన తల్లి పడుతున్న కష్టాలు చూసి తల్లడిల్లుతోంది. ఎలాగైనా ఆమెను తమ వద్దకు చేర్చాలని అధికారులను వేడుకుంటోంది. 'మా చదవుల కోసమని పీలేరులోని శ్రీనివాసులు అనే ఏజెంట్ సహకారంతో కువైట్‌కు వెళ్లింది. అతడు కుమారి అనే కువైట్ ఏజెంట్‌కు మా అమ్మను అప్పజెప్పారు. ఆమె రెండిళ్లలో పనికి కుదర్చింది. ఎంత పనిచేస్తున్నా చేయడంలేదని హింసిస్తున్నారు. అక్కడ ఉండలేమని ఇండియాకు వెళ్లిపోతామని మా అమ్మ ఏజెంట్ దగ్గరకు వెళ్లారు. ఏజెంట్ లేని సమయంలో నాకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు' అంటూ సుచిత్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



జగనన్న కాలనీలపై విజి'లెన్స్'



- ముమ్మరంగా దర్యాప్తు
- రెండు ప్రాంతాల్లోనే రూ.4.56 కోట్ల అవినీతి జరిగినట్లు అంచనా

జగనన్న కాలనీల్లో అవినీతి, అక్రమాలపై విజిలెన్సు అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. 5వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్న రెండు ప్రాంతాల్లోనే ఇప్పటికి రూ.4.56 కోట్ల అవినీతి జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. వీటిపై విజిలెన్సు డీజీ హరీష్‌కుమార్ గుప్తాకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఆయన విచారణకు ఆదేశించారు. విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో మూడు బృందాలు తనిఖీలు చేస్తున్నాయి.

ఏర్పేడు మండలం చిందేపల్లి, చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లి ప్రాంతాల్లో నిర్మించదలచిన దాదాపు 5000 జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం థర్డ్ ఆప్షన్ కింద ఓ కంపెనీకి కట్టబెట్టింది. ఒక్కో ఇంటికి రూ1.80లక్షలు మంజూరు చేసింది. ఇందులోనే సిమెంటు, కమ్మీ, ఇతర ముడిపదార్థాలను నేరుగా హౌసింగ్ శాఖ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇక్కడ్నుంచే కొందరు అక్రమాలకు తెరతీసినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఫిర్యాదులపై విజిలెన్సు విచారణ చేపట్టింది. చిందేపల్లిలో నిర్మించదలచిన దాదాపు 3500 గృహాల్లో పూర్తి కానివి దాదాపు 80 శాతం వరకున్నాయి. వీటిలో పునాది దశ దాటని ఇళ్లకు, పునాదులు పూర్తయినట్లు ఎం.బుక్కుల్లో నమోదు చేసి నిధులు స్వాహా చేశారన్న విమర్శలున్నాయి. అలాగే గోడలు నిర్మించిన దశలో దాదాపు 800 ఇళ్లు ఉండగా వాటికి మోల్డింగ్ పూర్తయినట్లు లెక్కలు చూపినట్లు అధికారుల తనిఖీల్లో తెలిసిందని సమాచారం. పునాది పడని ఇళ్లకూ పినట్లు ఎం.బుక్కులు నమోదైనట్లు సమాచారం. ఇక, ఎం.కొత్తపల్లిలో నిర్మించదలచిన 1500 ఇళ్లలో కనీసం 60 శాతం ఇళ్ళు కూడా పూర్తికాకనే బిల్లులు రాసుకున్నట్లు.. చాలా ఇళ్లు పూర్తికాకున్నా పూర్తయినట్లు ఎం.బుక్కులు నమోదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఒక్కో ఇంటికి 100 బస్తాల సిమెంటు ఇవ్వాల్సి ఉండగా, 40 నుంచి 45 మాత్రమే ఇచ్చి పూర్తిగా ఇచ్చినట్లు.. పునాది దశలో ఉన్న ఇళ్లకు గోడలు దశ పూర్తయిందని.. ఇక, మోల్డింగ్‌కు దాదాపు 2500 ఇళ్లు ఉన్నాయని లెక్కలు చూపి నిధులు పక్కదారి పట్టినట్లు విజిలెన్సు అధికారులు తనిఖీల్లో బయటపడినట్లు తెలుస్తోంది. ఇలా దాదాపు రూ.4.56 కోట్లు దుర్వినియోగమైనట్లు ఇప్పటి వరకున్న సమాచారం ఆధారంగా తెలుస్తోంది. ఈ అక్రమాల వెనుక ఎవరెవరున్నారనే దిశగానూ దర్యాప్తు సాగుతున్నట్లు సమాచారం. మరో వారం రోజుల్లో ప్రభుత్వానికి విచారణ నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

స్వేదం చిందించి సేద్యం సాగించి..!

● నేడు జాతీయ రైతు దినోత్సవం

కోటీశ్వరుడి నుంచి కూలీ వరకు.. ఐదు వేళ్లు నోట్లోకి పోవాలంటే రైతు చెమటను చిందించాలి. నష్టం వచ్చినా.. ప్రకృతి సహకరించక పోయినా.. సేద్యం చేస్తూ.. అందరి ఆకలి తీరేది.

అలాంటి అన్నదాతలకోసం డిసెంబరు 23న (సోమవారం) జాతీయ రైతు దినోత్సవం నిర్వహిస్తున్నారు. 'భారతదేశపు రైతుల విజేత'గా గుర్తింపు పొందిన మన దేశ 5వ ప్రధాని చరణ్‌సింగ్ పుట్టిన రోజును రైతు దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యాన్ని కాంక్షించి ప్రకృతి సేద్యం సాగిస్తున్న రైతు అయ్యప్పనాయుడు.. మండలంలోనే తొలిసారిగా పామోలిన్ సాగు చేసిన ఎయిర్‌ఫోర్సు విశ్రాంత ఉద్యోగి శంకర్‌రాజు.. వ్యవసాయంపై మక్కువతో ఉద్యోగం వదిలి పొలంబాట పట్టిన అశోక్‌రెడ్డి గురించి తెలుసుకుందాం.


సంప్రదాయ పద్ధతులతో సాగవుతున్న వరి


కషాయం తయారీపై విదేశీయులకు అవగాహన కల్పిస్తున్న రైతు అయ్యప్పనాయుడు

పుష్కరంగా ప్రకృతి సేద్యం

దామా అయ్యప్పనాయుడు.. తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామం. అధిక దిగుబడి కోసమని హైబ్రిడ్ విత్తనాలు, క్రిమిసంహారక మందులతో పంటలు సాగు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందని ఆందోళన చెందారు. భావితరాల మనుగడ కోసం ప్రకృతి సేద్యంవైపు అడుగులు వేశారు. 12 ఏళ్లకుపైగా తనకున్న ఆరు ఎకరాల్లో ప్రకృతిసేద్యం చేస్తూ మిగతా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పంట పోషకాలకు జీవామృతం, ఘనామృతం వాడుతున్నారు. పురుగుల నివారణకు వేప, కానుగ, ఉమ్మెత్త, సీతాఫలం, ఆముదంతో కలిపి కషాయం తయారు చేసి పిచికారీ చేస్తున్నారు. నవార, మైసూరు మల్లిగ వంటి సంప్రదాయ వరిపంటను సాగుచేస్తున్నారు. 'నిరంతర పంటలు.. ఆదాయం' అనే అంశంతో మూడు ఎకరాల్లో సంప్రదాయ పద్ధతులతో కూరగాయల సాగు చేపట్టారు. మామిడిలో అంతర పంటలనూ వేస్తున్నారు. రెండు ఎకరాల్లో మల్బరీ తోట వేశారు. వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. పాడిపరిశ్రమ ఉంది. ప్రతి పంటనూ ప్రకృతి పద్ధతులతో సాగు చేస్తున్నారు. ఈయన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని వివిధ కళాశాలల విద్యార్థులే కాకుండా దేశ, విదేశాల్లోని పలువిశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, రైతులు, విద్యార్థులు సందర్శించారు. మెక్సికో, ఆఫ్రికా దేశాలకు చెందిన ప్రొఫెసర్లు, అధికారులు కూడా వచ్చారు.

'రసాయన వ్యవసాయం వల్ల జీవ వైవిధ్యానికి నష్టం కలుగుతుంది. విపరీతమైన పెట్టుబడి. క్రమంగా నేల సారం క్షీణిస్తోంది. తద్వారా వ్యవసాయం సంక్షోభంలోకి చేరుకునే ప్రమాదం ఉంది. వర్డ్ సంస్థ ప్రతినిధి గంగాధరం ఉన్న పరిచయం కారణంగా భావితరానికి మంచి నేలను, మంచి పోషకాలున్న ఆహారాన్ని అందించాలని ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెట్టా'నంటారు అయ్యప్పనాయుడు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి


పైరు పరిశీలిస్తున్న రైతు కామిరెడ్డి అశోక్‌రెడ్డి

ఉన్న ఊరు.. సేద్యంపై మక్కువ

కామిరెడ్డి అశోక్‌రెడ్డి.. నాయుడుపేట మండలం మడపళం. అకౌంట్స్‌లో పట్టభద్రుడు. ఓ ఫ్యాక్టరీలో సీనియర్ అకౌంటెంట్‌గా మంచిజీతం. అయినా ఉన్న ఊరు.. వ్యవసాయంపై మక్కువతో పొలం బాట పట్టారు. తనకున్న 11 ఎకరాలలో వరిసాగు చేపట్టగా.. తొలిసారి ఆదాయం రాలేదు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు భూమి దుక్కినుంచి, విత్తనశుద్ధి, సాగు నీటి యాజమాన్యం, ఆధునికీకరణ పద్ధతులను పాటించడంతో ఎకరాకు 45నుంచి 50 బస్తాల ధాన్యం పండిస్తున్నట్లు అశోక్‌రెడ్డి చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో రైతులకు రాయితీతో పనిముట్లు, జిప్సం, బోరోనియం వంటి భూసారం చేసేవంటివి ఇచ్చే వారన్నారు. వైసీపీ పాలనలో వ్యవసాయ రంగాన్ని విస్మరించారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆధునిక పరికరాలు, డ్రోన్లు సబ్సిడీలో అందజేయాలని కోరారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి


ట్రాక్టర్‌లో పరిశ్రమకు తరలుతున్న పామోలిన్


- పామోలిన్ పంట

ఎయిర్‌ఫోర్సు నుంచి సేద్యానికి

శంకర్‌రాజు.. కేవీబీపురం మండలం పూడి సీకేపురానికి చెందిన ఎయిర్ ఫోర్స్‌లో పదవీ విరమణ చేశారు. స్వగ్రామానికి చేరిన వ్యవసాయంపై మక్కువతో రైతుగా మారారు. కొత్తగా సాగు చేయాలని యోచించిన ఆయన పామోలిన్‌పై దృష్టి పెట్టారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఐదు ఎకరాల్లో పామోలిన్ సాగు చేపట్టారు. మూడేళ్ల కాలపరిమితి దాటిపోవడంతో పంట చేతికి వచ్చింది. మండలంలోనే తొలిసారిగా పామోలిన్ మొక్కలను ఆయనే నాటారు. గతంలో టన్ను రూ.13,150 ఉండగా ప్రస్తుతం రూ.22,500కి చేరింది. తక్కువ పెట్టుబడి.. సమయం ఆదాతో పాటు లాభాలు పొందే అవకాశం ఉందని భావించిన చాలామంది రైతులు శంకర్‌రాజు వద్దకు వచ్చి పామోలిన్ సాగుపై సలహాలు తీసుకుంటున్నారు. నగరి వద్ద ఉన్న పరిశ్రమలకు పామోలిన్ తరలించాల్సి వస్తోంది. అది కూడా ప్రభుత్వమే సూచనలు ఇస్తుందని రైతు శంకర్‌రాజు తెలిపారు. మండలంలోనే పామోలిన్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే మరెంతోమంది సాగుపై మక్కువ చూపుతారన్నారు. కొత్తగా పామోలిన్ సాగు చేయాలనుకునే రైతు తన వివరాలు తెలిపితే రాయితీపై మొక్కలు అందజేస్తామని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.


రైతు శంకర్‌రాజు

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

పోలా.. అదిరిపోలా!


శ్రీకాళహస్తిలో ఆదివారం కలంకారీ వస్త్రాలను ధరించి మురిసిపోతున్న అమెరికన్లు.


యువకుడితో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది

సదాశివ కోనలో దారి తప్పిన యువకుడు

● రక్షించిన పోలీసులు

వడమాలపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలంలోని సదాశివ కోనకు వెళ్లొస్తుండగా తప్పిపోయిన యువకుడిని సెల్‌ఫోన్ సిగ్నల్ల ఆధారంగా పోలీసులు రక్షించారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో జరిగింది. చెన్నై నగరం తాంబరానికి చెందిన 20 మంది యువకులు ఆదివారం ఉదయం ఏర్పేడు మండలం చెల్లూరు, పాయల్ సెంటర్ మీదుగా సదాశివకోనకు నడిచి వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా సదాశివకోన ప్రాజెక్టుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో దినేష్ దారి తప్పాడు. మిగిలిన వారి ఆచూకీ తెలియక ప్రాజెక్టు వద్దకు చేరుకున్నాడు. రాత్రి 8.30 గంటల సమయంలో నెం.100కు ఫోన్ చేశాడు. పుత్తూరు సీఐ రవీంద్ర స్పందించారు. వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి, కానిస్టేబుళ్లు సురేష్, డిల్లీబాబును యువకుడిని వెదకడానికి పంపారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వారు ఆ యువకుడి ఆచూకీ గుర్తించారు. అటవీశాఖ సిబ్బందితో కలిసి బ్యాటరీ లైట్ల సాయంతో యువకుడిని చేరుకున్నారు. అతడిని వారి బృందానికి అప్పగించారు.

సిఫార్సులున్నా గంటల తరబడి నిరీక్షణ

● గదుల కోసం పద్మావతి, ఎంబీసీ వద్ద పడిగాపులు

తిరుమల, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన శ్రీనివాస్ మధ్యతరగతికి చెందిన వ్యక్తి. తిరుమలలో గది కోసం రెండు నెలల పాటు ఓ నాయకుడి చుట్టూ తిరిగి ఎట్టకేలకు సిఫార్సు లేఖ పొందారు. 'హమ్మయ్యా గదికి సమస్య లేదులే' అనుకుని తిరుమల చేరుకున్నారు. ఎంబీసీ34లో గది పొందాలని సూచన చేయడంతో ఉదయం 10 గంటలకు క్యూలైన్‌లోకి వెళ్లిన ఆయనకు.. మధ్యాహ్నం 3 గంటలైనా గది లభించలేదు.

● విజయవాడకు చెందిన మరో భక్తుడు కూడా ఇలానే దాదాపు ఐదు గంటలు నిలబడ్డారు.

● ఇక పద్మావతి విశ్రాంతి గృహంలోనూ ఉదయం క్యూలైన్‌లోకి వెళ్లే వారికి మధ్యాహ్నమైనా గదులు దొరకలేదు.

తిరుమలలో సాధారణంగా ఎలాంటి సిఫార్సుల్లేని భక్తులు సీఆర్వోలో గదులు పొందుతారు. ఇక రాజకీయ, వివిధ రాజ్యాంగహోదాలో ఉన్నవారైతే నేరుగా గదులు, దర్శనాలు పొందుతున్నారు. క్యూలైన్‌లో నిలబడలేక, హైలెవల్‌లో సౌకర్యాలు పొందలేక ఏదో తమకు తెలిసినవారి ద్వారా సిఫార్సు లేఖలు తీసుకొచ్చే మధ్య తరగతి భక్తులు మాత్రం అగచాట్లు పడుతున్నారు. ముఖ్యంగా సిఫార్సు లేఖలపై గదులు కేటాయించే పద్మావతి, ఎంబీసీ34 వద్ద భక్తులు గదుల కోసం గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సివస్తోంది. పిల్లలు, వృద్ధులు, లగేజీలతో ఈరెండు కౌంటర్ల వద్ద తిండితిప్పలు లేకుండా నిరీక్షిస్తున్నారు. దాదాపు పద్మావతి, ఎంబీసీ పరిధిల్లో దాదాపు 1,600 గదులు అందుబాటులోకి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్వహణ లోపంతో భక్తులు గంటల కొద్దీ నిలబడాల్సి వస్తోందనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల దర్శన టికెట్లు ఉన్నవారికే గదులు అనే విధానాన్ని అమలుచేయడంతో వారం పదిరోజుల పాటు గదులన్నీ మిగిలిపోయాయి. ఆ తర్వాత ఉన్నతాధికారుల మందలింపుతో తిరిగి సిఫార్సు లేఖలపై గదులు కేటాయించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇలా రిసెప్షన్ విభాగంలో సరైన నిర్వహణ లేకపోవడంతో వసతి విషయంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వసతి కల్పనపై దృష్టిసారించాల్సి ఉంది.


పద్మావతి వద్ద నిరీక్షిస్తున్న భక్తులు


ఎంబీసీ వద్ద గదుల కోసం ఇక్కట్లు

రోడ్డుకు మరమ్మతులు


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ఈవోపీఆర్‌డీ జనార్దన్, సర్పంచు మణి

చిట్టమూరు, డిసెంబర్ 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకపోయిన రోడ్డుకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. మండల పరిధి లోని తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే రోడ్డు వర్షాలకు దెబ్బతింది. దీంతో బురద గాలి, కొత్తపాళెం, కుమ్మరిపాళెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాలకు వెళ్లే ఆర్టీజీ సర్వీసు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఆదివారం ఆరూరు సర్పంచు ఎర్రబోతు మణి, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో కొట్టుకపోయిన రోడ్డుకు మరమ్మతులు చేట్టారు. ఆయా గ్రామాలకు ఆర్టీసీ సర్వీస్‌ను పునరుద్ధ రించారు. అలాగే పంచాయతీలో బ్లీచింగ్ చల్లించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


టైలరింగ్ శిక్షణ తరగతుల్లో మహిళలు

గూడూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో పలు వృత్తి విద్యాకోర్సుల్లో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సునీత సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి తెలిపారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే తమ సంస్థ ధ్యేయమని చెప్పారు. ఇందులో భాగంగా మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఆసక్తికి వయస్సుకు అడ్డుకాదని, 70ఏళ్ల ప్రమీల అనే వృద్ధురాలు శిక్షణ తరగతుల్లో తర్ఫీదు పొందడం అభినందనీయమన్నారు.

నవయాన బౌద్ధధర్మ స్వీకార మహోత్సవాన్ని జయప్రదం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామచంద్ర రావు, ఏడీపీఎస్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, జిల్లా అధ్యక్షుడు గోపాల్ తదితరులు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నవయాన బౌద్ధధర్మ స్వీకార మహోత్సవాన్ని జయప్రదం చేయాలని అంబేద్కరిజం, ఏడీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంగిలాల రామచంద్ర రావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జీఎస్ ఫంక్షన్ హాల్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరులోని అంబేద్కర్ భవన్‌లో ఈనెల 25న ఉదయం 10గంటలకు నవయాన బౌద్ధధర్మ స్వీకార మహోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, ఏడీపీఎస్ తిరుపతి అధ్యక్షుడు గుండవోలు గోపాల్, శ్రీనివాసులు, హరి, భూపతి సాయికుమార్, రమేష్, చలపతి, వరకుమార్, కృష్ణయ్య, పెంచలయ్య, ఆర్టీసీ అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘం అధ్యక్షుడికి సన్మానం


బుజగేంద్రను సన్మానిస్తున్న తీరప్రాంత గ్రామాల నాయకులు

వాకాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రావిగుంటపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన ఇంగిలాల బుజగేంద్రను ఆదివారం తీరప్రాంత గ్రామాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు వాకాటి సంపత్ కుమార్, వల్లమేడు సర్పంచు మల్లాపు నాగరాజు, మాజీ సర్పంచు మీజూరు నాగరాజు, వల్లమేడు సాగునీటి సంఘం అధ్యక్షుడు మీజూరు వెంకటేశ్వర్లు, కమతం శ్రీనివాసులు, వెంకటయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

జలసిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన జల సిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు

వాకాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలిపూడి పంచాయతీ వెంకటరెడ్డిపాళెం గ్రామంలో వెలసిన కామాక్షీదేవి సమేత జలసిద్ధేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కస్తూరయ్య, ఉపాధ్యక్షుడుగా హరి, కోశాధికారిగా సూరిశెట్టి విజయకుమార్, సభ్యులుగా మురళి, వెంకటసుబ్బయ్య, జగన్, అనిల్‌రెడ్డి ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి టీడీపీ నేతల కృతజ్ఞతలు


ఎమ్మెల్యే విజయశ్రీతో టీడీపీ నాయకులు సంచి కృష్ణయ్య, దామెర ప్రసాద్ నాయుడు, సిద్ధులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు

పెళ్లకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా దామెర ప్రసాద్‌నాయుడు ఎన్నికయ్యేందుకు కృషి చేసినందుకు టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్ నాయుడు, నాయకులు నేలవల్లి ప్రసాద్‌నాయుడు, మదనమోహన్ నాయుడు తదితరులు ఉన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సబ్‌స్టేషన్‌లో ఉద్యోగుల ఘర్షణ
షిఫ్ట్ ఆపరేటర్‌కు గాయాలు

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో ఉద్యోగుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక సబ్ స్టేషన్‌లో గూడూరుకు చెందిన కిరణ్‌కుమార్ షిఫ్ట్ ఆపరేటర్‌గా, కోట మండలం లక్ష్మక్కకండ్రిగకు చెందిన చంద్రయ్య సహాయకుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన చంద్రయ్య ఇనుప రాడ్‌తో కిరణ్‌కుమార్‌పై దాడి చేయడంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించి కేసు విచారిస్తున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గూడూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. కాగా, స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక యాథావిధిగా జరుగుతుందని, ప్రజలు ఈ మార్పును గమనిం చాలని కోరారు.

పక్షుల పండుగ పనులు మొదలయ్యేదెప్పుడు?

మూడు వారాల్లో ఉత్సవాలు ● అపరిశుభ్రంగా పడవల రేవు ● గుంతలమయంగా రోడ్లు


ముళ్లకంపల మధ్య ఉన్న భీములవారిపాళెం పడవల రేవు - రోడ్డు పక్కన ముళ్లకంపలు - గుంతలమయంగా ఉన్న పడవల రేవు రోడ్డు

తడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లుగా నిలిచిపోయిన పక్షుల పండుగను అట్టహాసంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 10వ తేదీ నుంచి మూడు రోజులపాటు పక్షుల పండుగ వైభవంగా నిర్వహిస్తామని, ఇందుకోసం రూ.6 కోట్లు వెచ్చించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రకటించారు. ఈ మేరకు జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ రోజూ సమీక్ష నిర్వహిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పనులు మాత్రం మొదలు కాలేదు. సాధారణంగా జనవరిలో పక్షుల పండుగను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిస్తే అంతకు రెండు నెలల ముందే అంటే నవంబరులోనే పనులు మొదలయ్యేవి. జిల్లా స్థాయి అధికారుల సమన్వయ సమావేశాలు, అధికారులు, నాయకులు, స్థానిక మత్స్యకారులతో పండుగ ఏర్పాట్లపై సమీక్షించేవారు. ఇక పక్షుల పండుగ విశిష్ఠతను చాటి చెబుతూ విజయవాడ, వైజాగ్, నెల్లూరు, తిరుపతి వంటి నగరాల్లో 5కే, 3కే, 2కే రన్ పోటీలు జరిగేవి. ప్రస్తుతం పక్షుల పండుగకు కేవలం 18 రోజుల సమయం మాత్రమే ఉంది. అయితే ఇప్పటికి వరకు ఎటువంటి పనులూ మొదలుకాలేదు. తడ మండలం భీములవారిపాళెంలో పక్షుల పండుగ జరిగే మూడు రోజులూ పడవ షికారు నిర్వహిస్తారు. ప్రస్తుతం పడవల రేవు వద్ద అపరిశుభ్ర వాతావరణం, ముళ్ల చెట్ల పొదలతో నిండిపోయి ఉంది. ఇక రోడ్లు గుంతలమయంగా మారి ముళ్ల కంపలు చొచ్చుకు వచ్చి వాహనాల రాకపోకలకు అనువుగా లేవు. సమయం తక్కువ ఉన్నా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించకుండా పక్షుల పండుగను ఎలా విజయవంతం చేస్తారోనన్న ప్రశ్న స్థానికుల్లో ఉదయిస్తోంది.

శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి


గణిత ప్రదర్శనను తిలకిస్తున్న డాక్టర్ కల్యాణ్ కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది

గూడూరు అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గణితశాస్త్ర అభివృద్ధి కోసం ఎనలేని సేవలు అందించిన శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కల్యాణ్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక గాయత్రి పాఠశా లలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినో త్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్రానికి రామానుజన్ అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోయా యన్నారు. ప్రతి విద్యార్థీ చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కష్టపడాలన్నారు. ఏకాగ్రతతో, పట్టుదలతో కష్టపడితే దేన్నైనా సాధించవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన గణిత ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, రఫీ, ధనశ్రీ, శ్రీహరిబాబు, సోనియా, సుప్రజ, హరిత, యామిని, సుప్రియ పాల్గొన్నారు.

గంగాప్రసాద్‌పై ఆరోపణలు తగదు: విజయశ్రీ

సూళ్లూరుపేట, పెళ్లకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్‌పై తప్పుడు కథనాలు ప్రచురించడం దుర్మార్గమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం ఆమె తన ఎమ్మెల్యే నివాసంలో టీడీపీ నాయ కులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ వైసీపీకి చెందిన పత్రికలో నిరాధరణ ఆరోపణలతో గంగా ప్రసాద్‌పై అసత్య కథనాలను ప్రచురించడం మంచి పద్ధతి కాదన్నారు. సీఎం చంద్రబాబు తమకు విలువలతో కూడిన రాజకీయం నేర్పించారని, ఎవరు తప్పు చేసిన ఉపేక్షించరన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, శ్రీనివాసులు నాయుడు, సంచి కృష్ణయ్య, విజయకుమార్ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, బొమ్మన పళణి, బొమ్మన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెళ్లకూరులో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ గంగాప్రసాద్‌పై అసత్య ఆరోపణలను ఖండించారు.

గురుకులంలో మత ప్రచారాన్ని అడ్డుకున్నాం: బీజేపీ

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఓ ఉపాధ్యాయురాలు బైబిల్ ద్వారా క్రైస్తవ ప్రచారంతో బోధన చేస్తుండగా తాము అడ్డుకొన్నామని బీజేపీ నాయకులు వాసు, లక్ష్మయ్య, డాక్టర్ రమేష్ ఆదివారం తెలిపారు. అలాగే గురుకులంలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణ రావు క్రైస్తవ మతం ప్రాముఖ్యం గురించి వివరించారని ఆరోపించారు. కాగా, తాము క్రిస్మస్ ఆవశ్యకత చెప్పామే తప్ప, మతప్రచారం చేయలేదని నారాయణరావు స్పష్టం చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నింఢ్ర శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య, కార్మికులు

వెంకటగిరిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిచాఆలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నింఢ్ర శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగ య్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికును ఆదుకోవాలని కోరారు. ఎన్ని కల్లో కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన మాటను నిల బెట్టుకోవాలని గుర్తుచేశారు. అనంతరం నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడుగా ఐలమ్మ, అధ్యక్షుడుగా శంకరయ్య, ఉపాధ్యక్షులుగా కొండయ్య, రాజయ్య, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, సహాయ కార్యదర్శులుగా గోవిందు బచ్చయ్య, నాగరాజు, కోశాధికారిగా వెంకటసుబ్బయ్య, సభ్యులుగా శ్యాంసుందర్, చెంచు కృష్ణయ్యను ఎన్నుకున్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మ వారికి నైవేద్యంగా నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించు కున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఏపీపీ ప్రకృతి కుమార్, సాయికుమార్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద యువసైన్యం ప్రచురించిన నూతన క్యాలెండర్‌ను దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. వెంకటగిరి పట్టణంలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీపీ ప్రకృతి కుమార్, న్యాయవాది సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు


స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రమణకుమార్

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట పోలీస్ స్టేషన్‌ను గూడూరు డీఎస్పీ రమణకుమార్ ఆదివారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని నేరాలు, సిబ్బంది పనితీరు గురించి ఆరాతీశారు. కోట, విద్యానగర్‌లో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని ఎస్‌ఐ పవన్‌కుమార్‌ను ఆదేశించారు.

టిడ్కో ఇళ్ల వద్ద కార్డెన్ సెర్చ్


కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న సీఐ రమణ, ఎస్‌ఐ సుబ్బరావు సిబ్బంది

వెంకటగిరి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణం తిరుపతి రోడ్డులోని టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీ వద్ద పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఉదయం 5గంటలకు తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలు, ఆటోను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సబ్బారావు, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి

నాయుడుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వినియోగ దారుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని ట్రాన్స్‌కో డీఈ వరప్రసాద్‌రెడ్డి సూచించారు. ఆదివారం నాయుడుపేటలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 1 లేదా 2 కిలో వాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్‌ను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పూర్తి రాయితీతో అందజేస్తాయన్నారు. లబ్ధిదారులు వినియోగించుకోగా మిలిగిన విద్యుత్‌ను ట్రాన్స్‌కో కొనుగోలు చేస్తుందని, తద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు పీఎంఎస్‌యుఆర్‌వైఏజీహెచ్‌ఏఆర్‌డాట్‌జీవోవి డాట్‌ఐఎన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

యానాదులకు దుస్తుల పంపిణీ


యానాదులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెలపూడి పంచాయతీ సాయినగర్‌లోని 40 యానాదుల కుటుంబాలకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. అలాగే దుప్పట్లు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ప్రశాంత్‌బాబు, సుమంత్, డేనియల్, చంద్ర, దినకర్‌బాబు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు


దుప్పట్లు అందజేస్తున్న రవీంద్రబాబు

గూడూరు అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందలి గ్రామంలో ఉన్న ప్రార్థన మందిరంలో ఆదివారం బాస్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు కూరపాటి రవీంద్రబాబు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యశ్వంత్, భావన, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

గూడూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, ప్రజేంద్రరెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసరాలను అందజేస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

పెళ్లకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేయనున్న పక్కా గృహాల కోసం ఇళ్లులేని వారు దరఖాస్తు చేసుకోవాలని నాయుడుపేట డివిజన్ హౌసింగ్ ఏఈ వెంకయ్య కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లలేని పేదలను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నామన్నారు. అర్హత వున్నవారు ఆయా సచివాలయాల్లో ఆధార్, బ్యాంకు అకౌంట్ పుస్తకం, జాబ్‌కార్డు తీసుకెళ్లి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పది మద్యం బాటిళ్ల స్వాధీనం

సూళ్లూరుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్‌వీకండ్రిగ వద్ద ఆదివారం డమాయి స్టాండ్లీ అనే వ్యక్తి వద్ద పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ సురేంద్రబాబు తెలి పారు. సూళ్లూరుపేటలోని ఓ షాపులో మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. స్టాండ్లీపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా పక్షుల పండుగ

సూళ్లూరుపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా పక్షుల పండుగను అట్టహాసంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు కేటాయించిందన్నారు. వైసీపీ హయాంలో ఆగిపోయిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మళ్లీ నిర్వహించేందుకు సీఎం ప్రత్యేక చొరవ తీసుకొన్నారన్నారు. అందరి సహకారంతో అంద రూ మెచ్చేలా నిర్వహించేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

సూళ్లూరుపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణానికి చెందిన చిరువెల వేణుగోపాల్‌కు రూ.లక్ష 26 వేలు, ఓజిలికి చెందిన కస్తూరయ్యకు రూ.లక్ష 19 వేలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు కాగా, ఆ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

ఉద్యమాలకు పురిటిగడ్డ కోట


కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్

కోట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పెత్తందారి వ్యవస్థపై తిరుగు బాటు ఉద్యమాలకు ఊపిరిపోసింది కోట మండలమేనని బహుజన సమాజ్‌పార్టీ ఇన్‌చార్జి షోడవరం సుధాకర్ అన్నారు. కోటలోని షాదీ మందిర్‌లో ఆదివారం దళిత ఉద్యమ నాయకుడు ఆర్‌వీ రమణయ్య సంస్మరణ సభ జరిగింది. పలు జిల్లాల నుంచి వచ్చిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉద్యమ కారులు, ఉద్యోగులు రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ సముద్రతీర మండలాలైన కోట, చిట్టమూరు, వాకాడు, చిల్లకూరు మండలాల్లో దళిత మహాసభ పేరుతో మొదటి సారిగా ఉద్యమాలు పుట్టాయన్నారు. అలాంటి ఉద్యమాలలో రమణ య్య కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణా రావు, డాక్టర్ రవికుమార్, బీవీ కృష్ణయ్య, నలమాకుల శ్రీనివాసులు, దారా మస్తానయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత


వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న దాతలు

నాయుడుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజయ్‌గాంధీ కాలనీలో ఉన్న మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చెన్నైకు చెందిన పాండ్యరాజ్, శ్యామ్యూల్, ఇస్మాయిల్, ఇక్బాల్ ఆది వారం దుప్పట్లు పంపిణీ చేశారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో పద్మనాభరెడ్డి, పసల హరిబాబు, ఆశ్రమ నిర్వాహకురాలు సునీత బెన్నీ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు వార్షిక శిక్షణ తరగతులు

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో రెండవ రోజు అయిన ఆదివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు వార్షిక శిక్షణ తరగతులు జరిగాయి. చెన్నై నుంచి వచ్చిన ఎక్స్‌పాఎన్‌జీవో బాలాజీ, హరిహరన్ ఎన్‌సీసీ క్యాడెట్లకు ఉద్యోగాల కల్పన, కొత్త ఆలోచనా విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, శిక్షణ అధికారి మాధవయ్య, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.